మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 7-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 339 Issue: 339

07 జూన్ 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:45 తిథి సప్తమి తె. 3:23౦ వరకు తరువాత అష్టమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం ధనిష్ఠ ఉ. 7:45 వరకు తరువాత శతభిష యోగం వైధృతి ఉ. 9:49 వరకు కరణం విష్టి మ. 3:03 వరకు బవ తె. 3:23౦ వరకు వర్జ్యం మ. 3:29 నుండి సా. 5:10 వరకు దుర్ముహూర్తం సా. 5:00 నుండి సా. 5:52 వరకు రాహుకాలం సా. 5:07 నుండి సా. 6:45 వరకు యమగండం మ. 12:15 నుండి మ. 1:52 వరకు గుళికాకాలం మ. 3:30 నుండి సా. 5:07 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు రా. 1:35 నుండి తె. 3:16 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:49 నుండి మ. 12:41 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial





# నోరు.. కావొద్దు మోరీ!

## మాటతీరుతోనే భార్యాభర్తల అన్యోన్యత

### దంపతులకు డీజీపీ సీవీ ఆనంద్ సంసార పాఠాలు

### పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'కలసి ఉంటే కలదు సుఖం'

### మళ్లీ కలిసిన 6,700 జంటలు.. 32,000 కౌన్సెలింగ్ సెషన్ల నిర్వహణ

నేటి సమాజంలో భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం ఎంతో అవసరమని డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు. మహిళలు, పిల్లల భద్రత, వారి సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటని ఆయన గుర్తుచేశారు. ఇందుకోసం ప్రభుత్వం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ షటిల్స్, సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి మహిళల భద్రతను మరింత బలోపేతం చేసిందన్నారు. కౌన్సెలింగ్ ద్వారా విడిపోతున్న కుటుంబాలను తిరిగి కలపడంలో మల్కాజిగిరి కమిషనరేట్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

బేగంపేట-హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): భార్యాభర్తల మధ్య కలహాలు రావొద్దంటే ఇద్దరి మాటతీరు మంచిదై ఉండాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. నోరు మంచిదైతే కాపురం చక్కగా నిలుస్తుందని తెలిపారు. మహిళల భద్రత, కుటుంబ సంక్షేమమే లక్ష్యంగా మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ఉమెన్ సేఫ్టీ వింగ్, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేటలో శనివారం మీ సురక్ష 'కలసి ఉంటే కలదు సుఖం' సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్ మట్లాడుతూ.. నేటి సమాజంలో భార్యాభర్తల మధ్య పరస్పర గౌరవం ఎంతో అవసరమని డీజీపీ ఆనంద్ స్పష్టం చేశారు. మహిళలు, పిల్లల భద్రత, వారి సాధికారతే రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఒకటని ఆయన గుర్తుచేశారు. ఇందుకోసం ప్రభుత్వం షీ టీమ్స్, భరోసా కేంద్రాలు, మహిళా పోలీస్ స్టేషన్లు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లు, షీ షటిల్స్, సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి మహిళల భద్రతను మరింత బలోపేతం చేసిందన్నారు. కౌన్సెలింగ్ ద్వారా విడిపోతున్న కుటుంబాలను తిరిగి కలపడంలో మల్కాజిగిరి కమిషనరేట్ చేస్తున్న కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ చారు సిన్హా మాట్లాడుతూ.. వైవాహిక బంధం నిలబడాలంటే భార్యాభర్తలిద్దరిలో ఓపిక, ఒకరిపై ఒకరికి విశ్వాసంతో పాటు పరస్పర అవగాహన ఎంతో అవసరమని సూచించారు. కుటుంబ వివాదాల పరిష్కారంలో భరోసా కేంద్రాలు, తరువాయి 2 వ పేజీలో...

# ఏఐ వాడకం పోర్న్ లాంటిదే!

## పలంటిర్ సీఈవో సంచలన వ్యాఖ్యలు

ప్రముఖ టెక్నాలజీ సంస్థ 'పలంటిర్' సీఈఓ అలెక్స్ కార్ప్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో తీవ్ర చర్చకు దారితీశాయి. కార్యాలయాల్లో కొందరు ఉద్యోగులు ఉత్పాదకతను విస్మరించి, కేవలం ఏఐ టోకెన్లను అధికంగా వినియోగించడాన్ని ఆయన 'పోర్న్ వ్యసనం'తో పోల్చారు. ఎక్కువ టోకెన్లు వాడినంత మాత్రాన వ్యాపారాలకు మెరుగైన ప్రయోజనం చేకూరుతుందని భావించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు.



న్యూయార్క్: 'పలంటిర్' నిర్వహించిన 'ఏఐపీకాన్ 10' కార్యక్రమంలో భాగంగా టీబీపీఎన్ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కార్ప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "కొందరు రోజంతా ఎటువంటి ఉత్పాదకత లేకుండా ఏఐతోనే సమయం గడుపుతున్నారు. ఇది ఒక రకమైన పోర్న్ వ్యసనం వంటిది. ఇలాంటి అనవసరపు అలవాట్లను నియంత్రించేందుకు మా సంస్థలో అంతర్గతంగా ఒక ప్రత్యేక సాంకేతిక పరికరాన్ని కూడా ఉపయోగిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఏఐ రంగంలో కంపెనీలు తరువాయి 2 వ పేజీలో...



# వాన జల్లు గిల్లుతుంటే!

### రాష్ట్రంలోకి విస్తరిస్తున్న నైరుతి.. అన్ని జిల్లాల్లో ఉరుములతో వర్షాలు

### 5 జిల్లాలకు భారీ వర్షసూచన.. వెల్లడించిన భారత వాతావరణశాఖ

రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించేందుకు వాతావరణం అనుకూలిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిక జారీ చేసింది. వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు: ఐఎండీ వెల్లడించిన సమాచారం ప్రకారం.. నల్లగొండ, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే, రాష్ట్రంలోని మొత్తం 33 జిల్లాల్లోనూ పలుచోట్ల ఉరుములు, మెరుపులు మరియు ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. హైదరాబాద్ సహా పరిసర ప్రాంతాల్లో రానున్న 24 గంటల పాటు -2 వ పేజీలో...



# దాహంతో 49 మంది మృతి

## సహారా ఎడారిలో విషాదం

జోహెన్నెస్‌బర్గ్: పశ్చిమాఫ్రికాలోని సహారా ఎడారిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. తాగునీరు దొరక్క దాహంతో 49 మంది ప్రాణాలు కోల్పోయిన విషాదం నైజర్ దేశాన్ని కలచివేసింది. పొరుగు దేశమైన మాలిలో బంధువుల వేడుకలకు హాజరై తిరిగి వస్తున్న ప్రయాణికులు ఎడారిలో చిక్కుకుపోవడంతో ఈ దుర్ఘటన జరిగింది. అధికారుల వివరాల ప్రకారం, నైజర్‌కు చెందిన పలువురు మాలి దేశంలో జరిగిన కుటుంబ వేడుకలకు హాజరయ్యేందుకు ట్రక్కులో సహారా ఎడారి మార్గం తరువాయి 2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,273 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,440 |

# కిషన్ రెడ్డి నీ సంగతి చెప్తా!

## మోదీని చూపెడితే భయపడ్తనా?

### గుండు, అరగుండులకు భయపడం.. కోహెడ సభలో సీఎం రేవంత్ రెడ్డి

ధాన్యం కొనడం చేతకాకపోతే గద్దె దిగాలని బీజేపీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని, నిజానికి తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని ప్రధాని మోదీ గద్దె దిగాలని, మేం రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. తెలంగాణలో ప్రతి గింజ కేంద్రంతో కొనిపిస్తానని, పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తానని, మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తానని, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణను అభివృద్ధి చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): కోహెడలో అంతర్జాతీయ ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ ,ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగించారు. పొమ్మంటే పోవడానికి తాను అల్లాటప్పాగా అధికారంలోకి రాలేదని, తొక్కుకుంటూ వచ్చామని, కార్యకర్తలు, ప్రజలు కోరుకుంటే వచ్చామని, ఫామ్‌హౌస్‌లో ఉన్న కేడీతోనైనా.. ఢిల్లీలో ఉన్న మోదీతోనైనా కొట్లాడతానని స్పష్టం చేశారు. ఎవరి మెడలైనా వంచుతానని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమాషాలు చేస్తున్నారన్నారు. తమకు మాటలతో పాటు చేతలు కూడావచ్చని, ఈ నెల 15న తర్వాత 75లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ పూర్తవుతుందని, ఆ తర్వాతా వాళ్ల సంగతి తేలుస్తానని, ధాన్యం, మక్కలు సహా పంటలను ఎలా కొనరో, మెట్రోకు నిధులు ఎందుకు ఇవ్వరో, వరంగల్, అదిలాబాద్ ఎయిర్ పోర్టులు ఎట్లా రావో , ఆర్ఆర్ఆర్ కు ఎందుకు అనుమతినివ్వరో, పాలమూరు- రంగారెడ్డి జాతీయ హోదా తరువాయి 2 వ పేజీలో...





# జంతర్ మంతర్‌లో జిల్లా పురుగులు

### భారీగా తరలివచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు.. నీట్ పేపర్ లీకేజీపై సీజేపీ ఆగ్రహం

### ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్.. 23న రామ్‌లీలా మైదానంలో భారీ సభ

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) శనివారం జంతర్‌మంతర్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించింది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు, పోటీ పరీక్షల అభ్యర్థులు, తల్లిదండ్రులు పెద్ద తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



2019లో అమెరికాలోని నార్త్ కరోలినాకు చెందిన ఆరోన్ స్మిత్ సింగ్యులారిటీ అనే వినూత్నమైన, వ్యంగ్యాత్మక డేటింగ్ యాప్‌ను రూపొందించాడు. ఈ యాప్‌లో పురుషులుగా ఎవరూ ఉండరు - అతనొక్కడే ఉంటాడు. యాప్‌లో చేరిన మహిళలు ఎంతసేపు స్వైప్ చేసినా, వారికి కనిపించేది వివిధ ఫోటోలు, భిన్నమైన ప్రొఫైల్ వివరాలతో ఉన్న ఆరోన్ స్మిత్ మాత్రమే. అంటే యాప్‌లో ఉన్న ఏకైక వరుడు అతడే. ఈ యాప్‌ను తాను సరదాగా క్రియేట్ చేశానని చెప్పుకొచ్చాడీ ప్రబుద్ధుడు.

# కాంగ్రెస్‌కు ఇదే ఆఖరి బార్



### పార్టీని 20 ఏళ్లు బొందపెట్టేలా రేవంత్ పనులు

### బందిపోట్లలో సీఎం సోదరులు, మంత్రులు

### భూదందాలన్నీ ఆధారాలతో బయటపెడతా

### పవన్ శిఖం భూమిని తిరిగిచ్చేయాలి: కవిత

రేవంత్ సర్కార్ లక్ష కోట్ల భూదోపిడీకి తెరతీసిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. పేదలకు అన్యాయం చేస్తూ పెద్దలకు ఈ భూములను కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రను బట్టబయలు చేస్తామన్నారు. రేవంత్ సర్కార్ భూదోపిడీని సాక్ష్యాధారాలతో వరుసగా ప్రజల ముందు ఉంచబోతున్నామన్నారు. బంజారాహిల్స్ లో తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో శనివారం ప్రెస్ మీట్ నిర్వహించారు.

హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి సోదరులు, మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు అంతా తెలంగాణ వనరులను బందిపోటు దొంగల్లాగా దోచుకుంటున్నారన్నారు. తెలంగాణ వనరులను, అస్తిత్వాన్ని కాపాడే పార్టీగా ప్రాణాలు ఫణంగా పెట్టి అయిన సరే ఈ భూదోపిడిని అడ్డుకుంటామన్నారు. అటు పవన్ కళ్యాణ్ కోడికుంట చెరువులో తరువాయి 2 వ పేజీలో...



# కాలనాగులతో జాగ్రత్త

### 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే

### తెలంగాణ భవిష్యత్తుపై బీఆర్ఎస్‌కే విజన్

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కౌలాలంపూర్/హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): రాష్ట్ర పరిస్థితులపై అవగాహన లేని కొందరు నాయకులు తెలంగాణ అభివృద్ధి, నీళ్లు, నిధుల అంశాలపై అడ్డగోలుగా వ్యాఖ్యలు చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. కాలం అనుకూలంగా లేనప్పుడు వానపాములు కూడా నాగుపాముల్లా బుసకొడతాయని వ్యాఖ్యానిస్తూ, అలాంటి విషనాగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. 2028లో తెలంగాణలో మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అవడం ఖాయమని ధీమా తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

7.6.2026

**మేషం:** చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో పురోగతి కలుగుతుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగాలలో ఒడిదుడుకులు తొలగుతాయి.

**వృషభం:** ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. చిన్ననాటి విషయాలు గుర్తు చేసుకుంటారు. గృహమున కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపార పరంగా అవరోధాలు అధిగమించి ముందుకు సాగుతారు. ఉద్యోగ అనుకూలత కలుగుతుంది.

**మిథునం:** ముఖ్యమైన పనులలో శ్రమకు ఫలితం ఉండదు. ప్రయాణాలు వాయిదా వేయటం మంచిది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. సన్నిహితులతో కలహ సూచనలు ఉన్నవి. కొత్త ఋణయత్నాలు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలలో ఊహించని సమస్యలు కలుగుతాయి.

**కర్కాటకం:** కొన్ని వ్యవహారాలు శ్రమతో పూర్తి చేస్తారు. బంధుమిత్రులతో విభేదాలు కలుగుతాయి. అనారోగ్య సమస్యలు చికాకు పరుస్తాయి. చేపట్టిన పనులు మధ్యలో వాయిదా పడతాయి. కుటుంబంలో ఊహించని వివాదాలు కలుగుతాయి. వ్యాపారాలు నిరాశ పరుస్తాయి. ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది.

**సింహం:** విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో ఆకస్మిక విజయం సాధిస్తారు. ప్రతికూల పరిస్థితుల నుండి తెలివిగా బయటపడతారు. వ్యాపారాలు పుంజుకుంటాయి. ఉద్యోగ వాతావరణం సంతృప్తికరంగా ఉంటుంది.

**కన్య:** చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. సమాజంలో పేరు కలిగిన వ్యక్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు అనుకూలిస్తాయి. ఉద్యోగాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి.

**తుల:** అనారోగ్య సమస్యల విషయంలో అశ్రద్ధ పనిచేయదు. దూర ప్రయాణాలు వాయిదా పడతాయి. కొన్ని పనులు వ్యయప్రయాసలతో గాని పూర్తి కావు. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. వ్యాపారాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగ వాతావరణం నిరాశ కలిగిస్తుంది.

**వృశ్చికం:** దూరప్రయాణాలలో శ్రమ మరింత అధికమవుతుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు కష్టానికి తగిన ఫలితం ఉండదు. వృత్తి వ్యాపారాలలో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. చేపట్టిన వ్యవహారాలలో అవాంతరాలు తప్పవు.

**ధనస్సు:** ఆర్థికాభివృద్ధి కలుగుతుంది. దూరపు బంధువుల నుండి కీలక విషయాలు సేకరిస్తారు. ప్రముఖుల సలహాలు కొన్ని వ్యవహారాలలో పనిచేస్తాయి. మంచి మాట తీరుతో ఇంటా బయట అందరినీ ఆకట్టుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో హోదాలు పెరుగుతాయి.

**మకరం:** అనుకోని ప్రయాణాలు వస్తాయి. ఋణదాతల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టకపోవటం మంచిది. కొన్ని వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. ఆలోచనలు స్థిరంగా ఉండవు. ఉద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి.

**కుంభం:** నిరుద్యోగులకు ఉద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. ఉద్యోగులు అధికారుల సహాయ సహకారాలు పొందుతారు. వ్యాపారస్తులకు అవసరానికి ధన సహాయం లభిస్తుంది. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. మిత్రుల నుంచి ఆకస్మిక ధన లబ్ది పొందుతారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**మీనం:** ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. చేపట్టిన పనులలో శ్రమ మరింత అధికమవుతుంది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో మరింత ఒత్తిడులు పెరుగుతాయి.

# నోరు.. కావొద్దు మోరీ!

మొదటి పేజీ తరువాయి

కౌన్సెలింగ్ సెంటర్లు అద్భుతమైన పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. వివాహం అనేది పరస్పర గౌరవం, అవగాహనపై ఆధారపడిన ఒక గొప్ప సామాజిక వ్యవస్థ అని తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ అకాడమీ హెడ్ శ్రీమతి ఎస్.ఎన్. శ్రీదేవి అన్నారు.

### 9,700కు పైగా కేసుల పరిష్కారం

మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి మాట్లాడుతూ.. తమ కమిషనరేట్ పరిధిలో ఎనిమిది ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకు 9,700కు పైగా కుటుంబ వివాదాలను కౌన్సెలింగ్ ద్వారా పరిష్కరించాం. 32,000కు పైగా సెషన్లు నిర్వహించాం. సీడీఈడబ్ల్యూ సేవలపై 90 శాతానికి పైగా బాధితులు సంతృప్తి వ్యక్తం చేయడం గర్వకారణం అని వివరించారు. కుటుంబ కలహాలతో విడిపోయి, పోలీసుల కౌన్సెలింగ్ మరియు మధ్యవర్తిత్వంతో తిరిగి ఒక్కటైన 150కి పైగా దంపతులు, వారి కుటుంబ సభ్యులు ఈ సదస్సులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంపతులు తమ అనుభవాలను వేదికపై పంచుకుంటూ, తమ కాపురాన్ని నిలబెట్టిన కౌన్సెలర్లు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తిరిగి కలిసిన దంపతులకు డీజీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉత్తమ సేవలు అందించిన సీడీఈడబ్ల్యూ కేంద్రాల సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మై ఛాయిస్ ఫౌండేషన్ ప్రతినిధి పెర్ల్ చోరగుడి, మల్కాజిగిరి మహిళా భద్రత డీసీపీ టి. ఉషారాణి, సీనియర్ పోలీస్ అధికారులు, షీ టీమ్స్, భరోసా కేంద్రాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### మహిళలకు అండగా స్త్రీ రైడ్

తెలంగాణలో మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయడంతోపాటు.. వారికి ఆత్మవిశ్వాసం, సమాజంలో భద్రతను పెంచడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ విమెన్ సేఫ్టీ వింగ్, తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ సంయుక్తంగా రూపొందించిన స్త్రీ రైడ్ ప్రాజెక్టును ఇవాళ హైదరాబాద్‌లో డీజీపీ సీవీ ఆనంద్ ప్రారంభించారు. రవాణా, డెలివరీ రంగాల్లో మహిళలు స్వయం ఉపాధి సాధించేలా ప్రోత్సహించేందుకు ఈ-బైక్స్, ఈ-ఆటోలను జెండా ఊపి సీవీ ఆనంద్ మొదలుపెట్టారు. ఇక ఈ కార్యక్రమంలోని తొలి విడతలో భాగంగా 55 మంది మహిళలకు స్త్రీ రైడర్లుగా అవకాశం కల్పించారు. ఈ 55 మందికి అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. వారందరికీ సీవీ ఆనంద్ డ్రైవింగ్ లైసెన్స్‌లు అందించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మహిళలకు సురక్షితంగా రవాణా సేవలు అందించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. స్విగ్గీ, జొమాటో తరహాలో డెలివరీ సేవల్లో మహిళలు భాగస్వామ్యం కావడంపై డీజీపీ సంతోషం వ్యక్తం చేశారు. రానున్న 4 నెలల్లో మహిళా రైడర్ల సంఖ్యను ఇప్పుడు ఉన్న దాని కన్నా 3 రెట్లు పెంచాలని హితవు పలికారు. మహిళల ఉపాధి, సాధికారతకు తెలంగాణ సర్కార్ పూర్తి మద్దతును ఇస్తోందని వెల్లడించారు. ఓలా, ఉబర్, ర్యాపిడో లాగానే మహిళల కోసం మహిళా డ్రైవర్లనే అందుబాటులోకి తీసుకువస్తూ.. మోవో ఫ్లీట్ యాప్ ద్వారా ఈ స్త్రీ రైడ్ సర్వీసులను ప్రారంభించారు. ఈ మోవో ఫ్లీట్ యాప్ వల్ల ఇక నుంచి యువతులు, మహిళలకు ఎలాంటి భయం లేకుండా వారు మహిళా డ్రైవర్లను బుక్ చేసుకుని ప్రయాణించే అవకాశం కల్పించారు.

# దాహంతో 49 మంది మృతి

మొదటి పేజీ తరువాయి

గుండా ప్రయాణించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం స్వదేశానికి తిరుగు ప్రయాణం చేస్తుండగా, అసమాకా సరిహద్దు ప్రాంతానికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో వారి ట్రక్కు చెడిపోయింది. నిర్మానుష్య ప్రాంతంలో వాహనం నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రక్కును మరమ్మతు చేసేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీంతో వారు రోజుల తరబడి ఎడారిలోనే చిక్కుకుపోయారు. కొద్ది రోజులకే వారి వద్ద ఉన్న తాగునీటి నిల్వలు పూర్తిగా అయిపోయాయి. చుట్టుపక్కల ఎక్కడా నీటి జాడ లేకపోవడంతో దాహంతో అలమటించారు. చివరకు ఇద్దరు వ్యక్తులు సుమారు 50 కిలోమీటర్లకు పైగా కాలినడకన ప్రయాణించి నీరు దొరికిన ప్రాంతానికి చేరుకుని, అక్కడి నుంచి అసమాకా పట్టణానికి వెళ్లి అధికారులకు సమాచారం అందించారు. సహాయక బృందాలు ఘటనాస్థలికి చేరుకునేసరికి.. ట్రక్కు చుట్టూ డజన్ల కొద్దీ మృతదేహాలు కనిపించాయని అధికారులు తెలిపారు. తీవ్ర ఎండలు, ఉక్కపోత, తాగునీటి కొరత కారణంగా 49 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. మరికొందరిని సురక్షితంగా తరలించి వైద్య సహాయం అందించినట్లు పేర్కొన్నారు. స్థానిక అధికారుల ప్రకారం, ఈ ఎడారి మార్గంలో సాధారణ పౌరుల రాకపోకలు చాలా అరుదుగా ఉంటాయి. ఎక్కువగా ఆఫ్రికా దేశాల నుంచి యూరప్‌కు వలస వెళ్లే వారు ఈ మార్గాన్ని ఉపయోగిస్తుంటారు. గతంలో కూడా ఇసుక తుఫాన్లు, తీవ్రమైన వేడి, ఆకలి, దాహం కారణంగా అనేక మంది ఈ మార్గంలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు గుర్తు చేశారు.

# వాన జల్లు గిల్లుతుంటే!

మొదటి పేజీ తరువాయి

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సాయంత్రం లేదా రాత్రి సమయాల్లో నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురు గాలులతో కూడిన భారీ వర్షపు జల్లులు పడే వీలుందని అంచనా వేశారు. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే రెండు, మూడు రోజుల్లో రుతుపవనాలు రాష్ట్రంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరించనున్నట్లు వాతావరణ కేంద్రం వివరించింది.

### ఏపీలోకి ప్రవేశించిన రుతుపవనాలు

జూన్ 4న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు, అక్కడి నుంచి అత్యంత వేగంగా ముందుకు కదిలి శనివారం ఆంధ్రప్రదేశ్‌లోకి అడుగుపెట్టాయి. రాబోయే కొన్ని రోజుల్లో ఇవి దక్షిణ కోస్తా జిల్లాలతో పాటు రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో గత రెండు, మూడు రోజులుగా ఇప్పటికే తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. అయితే రుతుపవనాల రాకతో రాబోయే వారంలో ఏపీవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని రోజులుగా జనాలను హడలెత్తించిన భానుడి భగభగలు తగ్గి, ఉష్ణోగ్రతలు ఈ వర్షాలతో అదుపులోకి రానున్నాయి. ఈ ఏడాది సకాలంలో వర్షాలు పడితే, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సాగు పనులు.. వరి నారుమళ్లు, నాట్లు వేసే ప్రక్రియ ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు ఇదే ఆఖరి బార్

మొదటి పేజీ తరువాయి

కొన్న పది ఎకరాలు శిఖం భూమేనని తేల్చిచెప్పారు. ఈ భూమిని వెంటనే తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి సాధించుకున్న తెలంగాణ...కచ్చితంగా మా జాగీరే అని స్పష్టం చేశారు. పేద ప్రజలకు తీరని అన్యాయం చేస్తూ, లక్ష కోట్ల విలువైన భూములను బడా బాబులకు అప్పనంగా అప్పగించే భారీ కుట్రకు రేవంత్ సర్కార్ తెరలేపిందని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈ దందాలో సీఎం సోదరులు, మంత్రులు, అధికార పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. బందిపోటు దొంగల్లాగా భూములు దోచుకుంటున్న వారి బండారం బయటపెడతామన్నారు. ముఖ్యంగా మూసీ నది గర్భంలోనే నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాన్ని నిర్మిస్తున్న 'శ్రీ ఆదిత్య బిల్డర్స్' పై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదో చెప్పాలని ప్రశ్నించారు. గతంలో ఇదే ఆదిత్య బిల్డింగ్ వద్ద మేము ధర్నా చేస్తే హైడ్రా తమపైనే దాడికి దిగిందని గుర్తు చేశారు. కానీ ఆధారాలు చూపించటంతో సైలెంట్ అయిపోయారని చెప్పారు. ఆదిత్య బిల్డర్స్ వాళ్లు ఏకంగా ఏడు ఎకరాలు మూసీలో కబ్జా పెట్టారని అన్నారు. దీని వెనుక ఒక ఎంపీ ఉన్నారని కవిత ఆరోపించారు. అదే విధంగా ప్రేమవతి పేట పెద్ద చెరువుకు సంబంధించి 2021లో అనుమతులు పొంది, నాటి నుంచి నేటి వరకు ఏకంగా ఏడు ఎకరాల చెరువు భూమిని కబ్జా చేశారని మండిపడ్డారు. రూ.700 కోట్ల విలువైన ఈ భూమిపై ఏకంగా 30 అంతస్తుల భవనాన్ని నిర్మిస్తూ వేల కోట్ల వ్యాపారం చేస్తున్నారన్నారు. అక్కడ ఉన్న గ్రామానికి సంబంధించిన పాత నక్షను సైతం మార్చేసి తప్పులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. బడా సంస్థ అయిన 'మెగా'కు చెందిన ఐకాం (×షీఎ) అనే ఆయుధాల తయారీ సంస్థ సైతం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 59లో ఉన్న మేడి బావి, జాలు బావి చెరువుల వద్ద ఐదు ఎకరాల భూమిని కబ్జా చేసిందని చెప్పారు. దీనిపై అక్కడి మున్సిపాలిటీలోనే తీర్మానం చేసినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పేదల ఇళ్లను కూల్చేస్తున్న హైడ్రాకు బడా బాబుల సంస్థలపై చర్యలు తీసుకునే దమ్ముందా అని సవాల్ విసిరారు. ఆదిత్య బిల్డర్స్ కు సంబంధించి పూర్తి ఆధారాలను బయటపెడుతామని హెచ్చరించారు.

# జంతర్ మంతర్‌లో జిల్లా పురుగులు

మొదటి పేజీ తరువాయి

సంఖ్యలో హాజరై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో మాట్లాడిన సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వాలు తమ ఉద్యమాన్ని, సోషల్ మీడియా కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకోవడం బాధాకరమన్నారు. పోటీ పరీక్షలు, నియామక పరీక్షల్లో తరచూ చోటుచేసుకుంటున్న అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉద్రిక్త వాతావరణంలో ప్రారంభమైన ఈ నిరసన చివరకు ప్రశాంతంగా ముగిసింది. రెండు వర్గాల మధ్య వివాదం తలెత్తే అవకాశం ఉందన్న కారణంతో పోలీసులు ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిరసనలో పాల్గొన్న కొందరు విద్యాశాఖ బాధ్యతలను విద్యావేత్త, ఆవిష్కర్త సోనమ్ వాంగ్‌చుక్‌కు అప్పగించాలని డిమాండ్ చేయగా, రాజకీయాల్లోకి రావాలనే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నిరసనకు దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. బీహార్‌కు చెందిన 26 ఏళ్ల రవికుమార్ తన సోదరితో కలిసి ఢిల్లీకి చేరుకున్నాడు. రెండేళ్లుగా నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న తన సోదరి భవిష్యత్తుపై ఈ వివాదం తీవ్ర ప్రభావం చూపిందని ఆవేదన వ్యక్తం చేశాడు. పశ్చిమ బెంగాల్ నుంచి సాహిల్ నేతృత్వంలో సుమారు 50 మంది విద్యార్థులు సొంత ఖర్చులతో ఢిల్లీకి వచ్చారు. విద్యా వ్యవస్థపై విశ్వాసం నిలబెట్టాలంటే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని వారు స్పష్టం చేశారు. అమెరికా నుంచి నేరుగా ఢిల్లీకి చేరుకున్న అభిజీత్ దిప్కే మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రజాస్వామ్యాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు, తల్లిదండ్రులు నెలలుగా మంత్రి తొలగింపును కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. తమ సామాజిక మాధ్యమ ఖాతాలపై ఆంక్షలు విధించడం, పోస్టులను తొలగించడం ద్వారా ఉద్యమాన్ని అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.

### జూన్ 23న భారీ సభ

విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న వైఫల్యాలకు జవాబుదారీతనం ఉండాలని సీజేపీ అధికార ప్రతినిధి అశుతోష్ రంకా డిమాండ్ చేశారు. జంతర్‌మంతర్ నిరసనకు లభించిన స్పందన తమ ఉద్యమానికి ప్రజా మద్దతు ఉందని నిరూపించిందన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఈ నెల 23న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీజేపీ ప్రకటించింది.

# కాలనాగులతో జాగ్రత్త

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. శనివారం మలేషియా తెలుగు అసోసియేషన్, బీఆర్ఎస్ ఎన్నారై మలేషియా శాఖ సంయుక్తంగా నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ మాతృభూమిని మర్చిపోకుండా తెలంగాణ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్న ప్రవాస తెలంగాణవాసులను ఆయన అభినందించారు. తెలంగాణ చరిత్ర వేల ఏళ్ల వారసత్వాన్ని కలిగి ఉందని, రాజులు, కవులు, కళాకారులు, సంస్కృతి, సంప్రదాయాలతో ఈ నేల ప్రత్యేక గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. ప్రతి తరం ఏదో ఒక పోరాటాన్ని నడిపించిందని, ప్రకృతిని ఆరాధిస్తూ బతుకమ్మ పండుగ జరుపుకునే ప్రత్యేక జాతి తెలంగాణదేనని చెప్పారు. తెలంగాణ బిడ్డలమని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకోవాలని పిలుపునిచ్చారు. ప్రత్యేక తెలంగాణ సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో సాగిన సుదీర్ఘ ప్రజాస్వామిక ఉద్యమమే రాష్ట్ర ఆవిర్భావానికి కారణమైందని కేటీఆర్ పేర్కొన్నారు. చిన్న రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ తక్కువ కాలంలోనే దేశవ్యాప్తంగా అభివృద్ధి నమూనాగా నిలిచిందన్నారు.

ఒకప్పుడు వలసలు, కరవులతో బాధపడిన తెలంగాణను దేశానికి అన్నపూర్ణగా మార్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని తెలిపారు. మలేషియా నమూనాలో తెలంగాణలో పామాయిల్ సాగును ప్రోత్సహించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. మలేషియా నుంచి విత్తనాలు, మొక్కలు తీసుకువచ్చి రైతులను ప్రోత్సహించడం వల్ల ప్రస్తుతం దేశంలో అత్యధిక పామాయిల్ ఉత్పత్తి చేసే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో ఇబ్బందులు ఎదుర్కొన్న తెలంగాణకు బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించిందని కేటీఆర్ పేర్కొన్నారు. అదే తరహాలో భవిష్యత్తులో అభివృద్ధి చెందిన దేశాల మాదిరిగా ప్రజలకు 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరాయంగా అందించడమే తమ ప్రధాన విజన్ అని చెప్పారు. ప్రజారవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు. తెలంగాణను మళ్లీ అభివృద్ధి పథంలో నడిపించే శక్తి కేసీఆర్‌కే ఉందని, బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని తెలిపారు.

# ఏఐ వాడకం పోర్న్ లాంటిదే!

మొదటి పేజీ తరువాయి

చేస్తున్న భారీ పెట్టుబడులకు, వస్తున్న ఫలితాలకు మధ్య గణనీయమైన వ్యత్యాసం ఉందనే విషయాన్ని కార్ప్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. మొదట్లో ఏఐ వినియోగానికి కొలమానంగా భావించిన ప్రాంప్ట్‌లు, టోకెన్ల సంఖ్య ఇప్పుడు కంపెనీలకు ఆర్థిక భారంగా మారుతోందని, వ్యయం పెరుగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని పలు సంస్థలు గుర్తిస్తున్నాయి. చైనా జీడీపీ వృద్ధిపై నివేదికలు రూపొందించడం వంటి సాధారణ విధులను ఏఐ సమర్థంగా నిర్వర్తిస్తుందని, అయితే సప్లై చైన్, మాన్యుఫ్యాక్చరింగ్, సైనిక కార్యకలాపాలు వంటి సంక్లిష్ట రంగాల్లో మానవ నైపుణ్యం, సమన్వయం తప్పనిసరి అని కార్ప్ వివరించారు. "లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ఈ పనులను మెరుగుపరుస్తాయి తప్ప, మానవ మేధస్సును పూర్తిగా భర్తీ చేయలేవు" అని తేల్చిచెప్పారు.

# కిషన్ రెడ్డి నీ సంగతి చెప్తా!

మొదటి పేజీ తరువాయి

ఎట్లా ఇవ్వరో చూస్తానని, కిషన్ రెడ్డి నీ సంగతి చెబుతానని, కేంద్రంలో ప్రధాని మోదీను చూపెట్టి మమ్మల్ని భయపెట్టాలని చూస్తున్నారేమోనని, మర్యాద దాటితే మా సంగతేమిటో చూస్తామని, కిషన్ రెడ్డి పొలిమేరలు కూడా దాటరని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. గుండు, అరగుండు సహా ఎవరికి భయపడేది లేదన్నారు.

'కారు' చెడిపోయి కార్ఖానాలో ఉంది

నాడు బీఆర్ఎస్ విధ్వంసం చేస్తే మేం వికాసం చేస్తున్నామని, బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా తెలంగాణను విధ్వంసం చేశారని రేవంత్ విమర్శించారు. 8లక్షల కోట్ల అప్పు ఉన్నప్పటికి విశ్వాసంతో రోజుకు 18 గంటలు కష్టపడి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తున్నానని, నిలబడి కొట్లాడి సమస్యలను పరిష్కారం చేసుకుంటూ ముందుకెలుతున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నార.'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉందని, ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు అని రేవంత్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోకుండా ఫామ్ హౌస్ కే పరిమితమయ్యాడన్నారు. తుమ్మిడిహట్టిని నిర్మించవద్దని అంటున్నారని, మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని, కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని మేం ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం అని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం అన్నారు.కేంద్రంతో సత్సంబంధాలు పెట్టుకుని రావాల్సిన నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం అని, 60 శాతం ఆదాయం రంగారెడ్డి జిల్లా నుంచే వస్తోందని, రాష్ట్ర వ్యాప్తంగా ఈ నిధులతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని తెలిపారు. ఫ్యూచర్ సిటీ కట్టి తీరుతాం

కాలుష్యం లేని పరిశ్రమల ఈ ప్రాంతానికి వస్తాయని, ఫ్యూచర్ సిటీకి, మెట్రో విస్తరణకు, త్రిబుల్ ఆర్ కు అడ్డం పడుతున్నారని, వరంగల్ ఎయిర్ పోర్టు బీఆర్ఎస్ అడ్డుకుంటుందని, అప్పుడు కావాలని మనం పోరాడితేజజ ఇప్పుడు అష్ట దరిద్రులు అడ్డం పడుతున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణలో ఎక్కడ నీళ్లు ఉన్నా కాళేశ్వరం నీళ్లు అన్నారని, చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట ఇప్పుడు పండలేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు పెడితే గోదావరి పాలయ్యాయాయని, కూలేశ్వరం కట్టిన వాళ్ళు మాకు సలహాలు ఇస్తున్నారని, హరీశ్ రావు సలహాలు విని.. ఆయన మామా నడ్డి విరిగి ఫామ్ హౌస్ లో పడ్డారంటూ రేవంత్ ఎద్దేవా చేశారు. అభివృద్ధిని అడ్డుకునే రాజకీయాలు చేస్తే రాబోయే రోజుల్లో ప్రతిపక్ష హోదా కాదు కాదా.. కారును తోయడానికి కూడా ఎవరూ దొరకరని విమర్శించారు. డిసెంబర్ నుంచే ఫ్రూట్ మార్కెట్ లో కార్యకలాపాలు ప్రారంభం కావాలని, రెండేళ్లలో ఫ్రూట్ మార్కెట్.

నిర్మాణం పూర్తి కావాలని, ఫ్రూట్ మార్కెట్ కోసం నిధులను గ్రీన్ ఛానల్ లో ఇస్తామని వెల్లడించారు. ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం కోసం తుమ్మల, శ్రీధర్ బాబు ఇక్కడ కుర్చీ వేసుకుని కూర్చోవాలని సూచించారు. రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలకు ఏం కావాలన్నా ఇక్కడికి వస్తే అన్నీ అందుబాటులో ఉండే విధంగా 240 ఎకరాల్లో రూ. 2,300 కోట్లతో అత్యాధునిక వసతులతో మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు.

# వందల ఎకరాల భద్రాచలం భూములు కబ్జా

## ఏపీ మంత్రికి తెలంగాణ మంత్రి కొండా సురేఖ లేఖ




హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో.. భద్రాచలం మండలంలో కొన్ని గ్రామాలు ఆంధ్రప్రదేశ్‌లోకి వెళ్లాయి. భద్రాచలం ఆలయం మాత్రం తెలంగాణ భూభాగంలోనే ఉండిపోయింది. అయితే భద్రాచలం సీతారామ ఆలయానికి సంబంధించిన కొన్ని భూములు మాత్రం.. ఏపీలోకి వెళ్లిన గ్రామాల్లో ఉండిపోయాయి. ఈ క్రమంలోనే భద్రాచలం ఆలయ భూములపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. దీంతో వాటిని ఆక్రమించడం మొదలుపెట్టారు. దీంతో ఆ భూములు ఆలయానికి సంబంధించినవని హైకోర్టు తేల్చి చెప్పింది. కానీ ఆ ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు ప్రయత్నించగా.. స్థానికులు భౌతిక దాడులకు దిగడం సంచలనం రేపింది. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి కొండా సురేఖ ఏపీ మంత్రికి లేఖ రాశారు. భద్రాచలం ఆలయ భూముల రక్షణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి.. తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.. తాజాగా ఒక లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఉన్న భద్రాచలం ఆలయ భూముల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని కోరారు. పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న రాములోరి వందల ఎకరాల భూములను హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా రక్షించాలని కొండా సురేఖ ఆ లేఖలో పేర్కొన్నారు. ఆ భూములను ఆక్రమించిన వారిని అక్కడి నుంచి తరలించి.. వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 1878 అక్టోబర్ 12వ తేదీన భద్రాచలం రాముడి కోసం.. సోమరాజు పురుషోత్తమ దాసు అనే భక్తుడు తనకు ఉన్న 917 ఎకరాల భూమిని రిజిస్టర్డ్ వీలునామా ద్వారా ఆలయానికి బహుకరించినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. అప్పటి నుంచి ఆ భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకాలు, యాజమాన్య హక్కులు అన్నీ భద్రాచలం ఆలయ దేవస్థానం పేరు మీదే ఉన్నాయని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ భూమి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా పురుషోత్తపట్నం గ్రామ పరిధిలోకి వెళ్లాయని తెలిపారు. ఆ గ్రామంలోనే 1 నుంచి 101 సర్వే నంబర్లలో ఆ భూములు విస్తరించి ఉన్నాయని పేర్కొన్నారు. అయితే ఈ 917 ఎకరాల భూమిలో దాదాపు 889.50 ఎకరాల భూమి ఆక్రమణలకు గురైనట్లు ఆ లేఖలో మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆ భూములపై ఎండోమెంట్ ట్రిబ్యునల్, స్థానిక కోర్టులతో పాటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా భద్రాచలం ఆలయానికి అనుకూలంగానే తీర్పులు ఇచ్చాయని తెలిపారు. రాష్ట్రీయ వానరసేన దాఖలు చేసిన పిల్, దేవస్థానం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లపై 2022 నవంబర్ 7వ తేదీన విచారణ జరిపిన హైకోర్టు.. కబ్జాదారుల నుంచి భూములను రక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తూ.. తీర్పును వెలువరించిందని గుర్తు చేశారు. హైకోర్టు తీర్పు ఉన్నప్పటికీ.. ఏపీకి చెందిన స్థానిక రెవెన్యూ, గ్రామ పంచాయతీ, పోలీస్ అధికారులు మాత్రం ఆలయ భూముల్లో ఆక్రమణల తొలగింపునకు సహకరించడం లేదని భద్రాచలం ఆలయ అధికారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. భద్రాచలం దేవస్థానం సిబ్బంది ఆక్రమణలను అడ్డుకునేందుకు ప్రయత్నించినపుడు.. ఆక్రమణదారులు వారిపై భౌతిక దాడులకు దిగుతున్నారని గుర్తు చేశారు. 2025 జూలై 8వ తేదీన అక్రమ నిర్మాణాలను కూల్చివేసే క్రమంలో దేవస్థాన ఈఓ, సిబ్బందిపై దాడులు జరిగినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అధికారుల నుంచి చట్టపరంగా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో.. రాత్రికి రాత్రే కబ్జాదారులు అక్రమంగా ఇళ్లను నిర్మిస్తూ.. దేవస్థానానికి ఆర్థిక నష్టాన్ని చేకూరుస్తున్నారన్నారని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే హైకోర్టులో కంటెమ్ట్ కేసులు కూడా ఆలయ అధికారులు దాఖలు చేసినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి స్వయంగా ఈ విషయంలో జోక్యం చేసుకుని.. రెండు రాష్ట్రాల ప్రజల సెంటిమెంట్లు, ప్రజా ప్రయోజనార్థం చర్యలు చేపట్టాలని కొండా సురేఖ కోరారు. పోలవరం జిల్లా కలెక్టర్, పోలీస్ యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చి.. భద్రాచలం రాములోరి ఆస్తులను కాపాడి దేవస్థానానికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# కొమురవెల్లి రైల్వేస్టేషన్ పనులు పూర్తి

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి




సిద్దిపేట/హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, కొత్త రైలు మార్గాలు, పాత రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తోంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే పలు కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణాలు పూర్తై అందుబాటులోకి రాగా.. మరికొన్నింటి నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఇక కొన్ని రైల్వే స్టేషన్‌లకు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణలో ప్రముఖ దేవస్థానమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి అతి దగ్గర్లో కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. అయితే కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని.. త్వరలోనే భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు.. లకుడారం – దుద్దెడ మధ్య రైల్వే శాఖ కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 99 శాతం పూర్తి అయ్యాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ఒక ట్వీట్ చేశారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణానికి 2024 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేయగా.. రూ. 5.63 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా నిర్మించారు. ఇక రైల్వే ప్రయాణికుల కోసం ఈ కొమురవెల్లి స్టేషన్‌లో పలు అత్యాధునిక వసతులను కల్పించారు. 450 మీటర్ల పొడవైన హై లెవల్ ప్లాట్‌ఫారమ్.. 5 షెల్టర్లు, విశాలమైన వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్లు, తాగునీటి వసతి.. మహిళలు, పురుషులు, దివ్యాంగులకు స్పెషల్ మరుగుదొడ్లను నిర్మించారు. ఈ రైల్వే స్టేషన్‌కు మెరుగైన అప్రోచ్ రోడ్లు, విశాలమైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఆర్కిటెక్చరల్ ఎలివేషన్, మల్లన్న స్వామి, స్థానిక ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణంతో భక్తులు మల్లన్న దేవాలయానికి సులభంగా, నేరుగా చేరుకునే అవకాశం కలగనుంది. రాజీవ్ రహదారికి (ఎస్‌హెచ్-1) సమీపంలో ఈ రైల్వే స్టేషన్ ఉండటం వల్ల ప్రయాణం మరింత సజావుగా సాగుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో రూపుదిద్దుకున్న ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ ద్వారా తెలంగాణలో ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడటమే కాకుండా.. ఆధ్యాత్మిక పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.




# హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రా

## సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

బెంగళూరు/హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకువచ్చిన హైడ్రా .. దేశవ్యాప్తంగా ఆసక్తికరంగా మారిన సంగతి తెలిసిందే. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు ఆక్రమించి కట్టిన నిర్మాణాలను.. నిర్దాక్షిణ్యంగా హైడ్రా అధికారులు కూల్చేస్తున్నారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగులు పెడుతున్నాయి. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ హైడ్రాను.. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. ఇక తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా హైడ్రా తరహా వ్యవస్థను తీసుకురావాలని జనాలు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు సంబంధించి హైడ్రా పేరు మార్మోగుతూ ఉంది. 2023 చివర్లో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఏర్పడిన తర్వాత.. 2024 జూలైలో హైడ్రాను ఏర్పాటు చేస్తూ.. రాష్ట్ర సర్కార్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ హైడ్రాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. హైడ్రాకు ఆ పేరు పెట్టడానికి గల కారణాలను ఆయన వివరించారు. జర్మనీ నియంతగా పేరు గాంచిన అడాల్ఫ్ హిట్లరే ఇందుకు కారణమని సీఎం రేవంత్ రెడ్డి.. తాజాగా బెంగళూరులో జరిగిన ఓ నేషనల్ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. హిట్లర్‌కు హైడ్రా అనే పేరు చాలా ఇష్టం అని.. హిట్లర్‌కు చాలా దగ్గరగా ఉన్న హంతక ముఠా పేరు హైడ్రా అని రేవంత్ రెడ్డి తెలిపారు. అందుకే అక్రమ కట్టడాలు కట్టాలనే వారు భయపడాలనే ఉద్దేశంతోనే హైడ్రా అని పేరుపెట్టినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఎవరు చెరువులను ఆక్రమించాలని అనుకున్నా.. భయపడాలని ఉద్దేశంతోనే ఆ సంస్థకు హైడ్రా పేరు పెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎవరైనా చెరువులు, కుంటల జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని పేర్కొన్నారు. అందుకే సీనియర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో 3000 మందితో హైడ్రాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. లగ్జరీ బిల్డింగ్‌లు, ఫామ్ హౌస్‌ల కోసం ధనవంతులు చెరువులను ఆక్రమిస్తున్నారని.. ఆ తర్వాత వ్యర్థాలను అదే చెరువుల్లోకి వదిలేసి.. కలుషితం చేస్తున్నారని సీఎం రేవేత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు, ఎక్కడ ఆక్రమణలు చేసినా.. ఆ నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నామని తేల్చి చెప్పారు. ఇక డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే అత్యుత్తమమైనదని.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను చూసి దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని పేర్కొన్నారు.

# త్వరలోనే పోలీస్ ఉద్యోగాల భర్తీ: రేవంత్

హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): తెలంగాణ పోలీస్ శాఖలో త్వరలోనే ఖాళీల భర్తీ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తాజాగా ఒక కీలక ప్రకటన చేశారు. త్వరల్లోనే 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ జాతీయ మీడియా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి.. తెలంగాణలో నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు తమ ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతోందని వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఏకంగా 67760 ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన వారు.. పాలకులుగా వచ్చారని.. కానీ తాను మాత్రం ఒక పాలకుడిగా కాకుండా.. సేవకుడిగా, సామాన్య ప్రజల ప్రతినిధిగా వచ్చినట్లు రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఎన్నికలకు ముందు నిర్వహించిన పాదయాత్రలో రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా తెలుసుకున్నానని గుర్తు చేశారు. అందుకే తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపారు. అంతేకాకుండా మన దేశంలోనే అత్యధిక సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత తెలంగాణదేనని గర్వంగా చెప్పారు. కొన్ని రోజుల్లోనే పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 5 వేల పోస్టులను భర్తీ చేసేందుకు.. జాబ్ నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన చేశారు. తెలంగాణలోని యువత ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. ఇక జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఒకేసారి 3 ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేసిన సంగతి తెలిసిందే.

# మేం గొర్రెలం కాదు.. సూటిగా జవాబివ్వు


## నాగబాబుకు ప్రకాష్ రాజ్ కౌంటర్



హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): కొద్దిరోజులుగా తెలుగు రాష్ట్రాల్లో రాజకీయాలు వేడెక్కాయి. తెలంగాణ ఆవిర్భా దినోత్సవం రోజు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో జనసేన పార్టీ సభ ఏర్పాటు చేయడం.. పోలీసులు అనుమతి నిరాకరించడం హాట్ టాపిక్ అయ్యింది. అదే రోజు పవన్ కళ్యాణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలు మరింత హీట్ పెంచాయి. తెలంగాణ ఎవరి జాగీరు కాదని.. జనసేన పార్టీ తెలంగాణలో పోటీ చేస్తుందని ప్రకటించారు. అయితే పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై జస్ట్ ఆస్కింగ్ అంటూ సోషల్ మీడియాలో ట్వీట్లు పెట్టే ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్ స్పందించారు. సింగిల్‌గానా, పొత్తుతోనా అంటూ ప్రశ్నించారు. ప్రకాష్ రాజ్ వ్యాఖ్యలకు నిర్మాత బండ్ల గణేష్ కూడా స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు పరోక్షంగా ప్రకాష్ రాజ్‌ను ప్రస్తావిస్తూ ట్వీట్ చేయగగా.. ప్రకాష్ రాజ్ కూడా కౌంటరిచ్చారు. 'నాయకుడి మాటే అంతిమం. ఆయన మార్గంలో దెయ్యాలనూ, భూతాలనూ ఎవరూ చూడలేదు, ఏది ఒప్పో, ఏది తప్పో ఆయనకు మాత్రమే తెలుసు. మీ సందేహాలను పక్కనపెట్టండి, నోరుమూయండి, ఏ ప్రశ్నలూ వేయకుండా నాయకుడిని అనుసరించండి' అంటూ జనసేన పార్టీ ఎమ్మెల్సీ నాగబాబు ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌లో ఎక్కడా ప్రకాష్ రాజ్ పేరును ప్రస్తావించలేదు. ప్రశ్నలు వేయకండి అనడంతో ప్రకాష్ రాజ్ నాగబాబు ట్వీట్‌పై స్పందించారు. 'మీ సందేహాలు ఆపేయండి, మీ నాలుకను సైలెంట్ చేయండి, ప్రశ్నించకుండా నాయకుడ్ని అనుసరించడి' అంటే అర్థం ఏంటి. మేము గొర్రెలం కాదు.. బానిస బ్రతుకు బ్రతకడానికి. ఈ బెదిరింపులు వద్దు నాగబాబు గారు. ప్రశ్నించడం మా హక్కు. ఏ నాయకుడైనా.. నేనే నాయకుడిని అనుకున్నవాడైనా, సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది. అర్థం అయిందా?' అంటూ నాగబాబుకు ప్రకాష్ రాజ్ కౌంటరిచ్చారు. రెండు రోజుల క్రితం కూడా ప్రకాష్ రాజ్ ఓ ట్వీట్ చేశారు. అందులో.. 'మీరొస్తానంటె మేమొద్దంటామా.. రండి దొర .. కానీ వచ్చే ముందు ఉత్తుత్తినే వస్తున్నారా? పొత్తుతో వస్తున్నారా? లేదా సింగల్ గా వస్తున్నారా?.. అది చెప్పి రండి' అంటూ పరోక్షంగా పవన్ కళ్యాణ్ పేరు ప్రస్తావించకుండా ప్రకాష్ రాజు ట్వీట్ చేశారు. వెంటనే స్పందించిన బండ్ల గణేష్ ప్రకాష్ రాజ్‌కు ఘాటుగా రిప్లై ఇచ్చారు. "ప్రతి దాంట్లో వేలుపెట్టడం? అసలు నువ్వెవడివి?.. ముందు నీ అడ్రస్ నువ్వు తెలుసుకో, తర్వాత ప్రపంచాన్ని మార్చే ప్రయత్నం చేయ్' అంటూ బండ్ల గణేష్ ట్వీట్ చేశారు. అప్పటి నుంచి ఈ ట్వీట్ వార్ కొనసాగుతోంది. మరి ప్రకాష్ రాజ్ రిప్లైకి నాగబాబు కౌంటర్ ఎలా ఇస్తారో చూడాలి.

# విశాఖ కేజీహెచ్‌లో ఇమ్యునోథెరపీ ఉచితం

విశాఖపట్నం, జూన్ 6 (ఈవార్తలు): విశాఖపట్నం కింగ్ జార్జి ఆసుపత్రి (కేజీహెచ్)లో క్యాన్సర్ పేషెంట్లకు ఖరీదైన ఇమ్యునోథెరపీ చికిత్స ఉచితంగా అందించనున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్నవారిలో నాలుగో దశలో అత్యంత ఖరీదైన ఇమ్యునోథెరపీ అందించాల్సి ఉంటుందని కేజీహెచ్ మెడికల్ క్యాన్సర్ విభాగాధిపతి డాక్టర్ శిల్ప తెలిపారు. ఈ ఇమ్యునోథెరపీ ట్రీట్మెంట్ తీసుకోవాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల వెళ్లాలని.. అక్కడ చాలా ఖర్చు అవతుందని.. కానీ కేజీహెచ్‌లో మాత్రం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడేవారికి ఇమ్యునోథెరపీకి సంబంధించి ఒక్కో సైకిల్‌కు రూ.4 లక్షలు ఖర్చు అవుతుందన్నారు. ఇలా ఏడాదిలో మూడు వారాలకు ఒకసారి మొత్తం 17 సార్లు చికిత్స చేయాల్సి వస్తుందన్నారు. ఇలా చూస్తే ప్రైవేట్ ఆస్పత్రుల్లో మొత్తం 17 సైకిల్స్‌కు కలిపి రూ.68 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. అలాంటి ఖర్చుతో కూడుకున్న ఈ ఇమ్యునోథెరపీని ఏడాది పాటు కేజీహెచ్‌లో ఉచితంగా అందిస్తామన్నారు. ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితుల కోసం కేజీహెచ్‌లో కీమోథెరపీ, ఇమ్యునోథెరపీపై క్లినికల్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు డాక్టర్ శిల్ప తెలిపారు. తాను ఈ ట్రయల్స్‌కు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్‌గా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. విశాఖపట్నం కింగ్ జార్జి ఆస్పత్రిలో అరుదైన సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారు. ఓ మహిళ కడుపు నుంచి 4.50 కిలోల కణితిని తొలగించారు. విజయనగరానికి చెందిన రజని ఏడాదిగా పొట్ట ఉబ్బిపోయి బాధపడుతున్నారు. మే 14న ఆమె కేజీహెచ్‌కు రాగా.. యూరాలజీ డిపార్ట్‌మెంట్‌లో పరీక్షలు నిర్వహించారు. ఆ రిపోర్టులు పరిశీలించిన డాక్టర్లు అడ్రినల్ గ్రంధిలో పెద్ద కణితి ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి సమస్య చాలా అరుదుగా వస్తుందని.. ఒక లక్ష మందిలో నలుగురికి ఎదురవుతుందన్నారు. గత నెల 19న యూరాలజీ హెచ్‌వోడీ డాక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో డాక్టర్ల టీమ్ సర్జరీ చేసిన మహిళ కడుపు నుంచి 4.50 కేజీల కణితిని తొలగించారు. బాధితురాలు పూర్తిగా కోలుకోవడంతో రెండు రోజుల క్రితం డిశ్చార్జ్ చేసి ఆ వివరాలు వెల్లడించారు. డాక్టర్లు దీన్ని వైద్యభాషలో బైలాటరల్ అడ్రినల్ మైలోలిపోమా విత్ కంజెనిటల్ అడ్రినల్ హైపర్‌ప్లేసియాగా పిలుస్తారని తెలిపారు.



మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# అమెరికాలో తెలంగాణ యువకుడి హత్య

## పిజ్జా డెలివరీ చేస్తుండగా దుండగుల కాల్పులు

### నార్త్ ఫిలడెల్ఫియాలో ఘటన

మేడ్చల్, జూన్ 6 (ఈవార్తలు): ఉపాధి నిమిత్తం అమెరికా వెళ్లిన తెలంగాణకు చెందిన ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నార్త్ ఫిలడెల్ఫియాలో పిజ్జా డెలివరీ చేస్తుండగా గుర్తుతెలియని దుండగులు జరిపిన కాల్పుల్లో అతడు ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన కుంచ అన్షుల్‌గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే, అన్షుల్ అమెరికాలో పిజ్జా డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే విధుల్లో భాగంగా పిజ్జా డెలివరీ చేసేందుకు వెళ్లగా, దుండగులు అతడిపై కాల్పులు జరిపారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన అన్షుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్షుల్ మరణవార్త విన్న అతడి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. తమ కుమారుడి మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వదేశానికి రప్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని అధికారులను వేడుకుంటున్నారు.

# బొల్లా బ్రహ్మనాయుడికి 14 రోజుల రిమాండ్

ఉప్పల్-హైదరాబాద్, జూన్ 6 (ఈవార్తలు): సైబరాబాద్ పరిధిలోని గండిపేటలో వెలుగుచూసిన రూ.1,500 కోట్ల రూపాయల భూకుంభకోణం కేసులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడికి న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. తమిళనాడులో అరెస్టయిన ఆయనను పోలీసులు శనివారం హైదరాబాద్‌లోని ఉప్పల్ కోర్టులో హాజరుపరిచారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేయడంతో, పోలీసులు ఆయనను చంచల్‌గూడ కేంద్ర కారాగారానికి తరలించారు. ఈ కేసు వెలుగుచూసినప్పటి నుంచి పరారీలో ఉన్న బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు శుక్రవారం తమిళనాడులోని కాంచీపురంలో అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తరలించి, నార్సింగి పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. ఈ క్రమంలో ఆయన అనుచరులు, వైసీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడంతో అక్కడ కొంత సమయం పాటు ఉద్రిక్తత నెలకొంది. దీంతో పోలీసులు కట్టుదిట్టమైన భద్రత నడుమ బ్రహ్మనాయుడిని కోర్టుకు తరలించారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని సర్వే నంబర్ 18లో గల సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మనాయుడు మరికొందరితో కలిసి కుట్ర పన్నారని గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి మే 23న నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు), రెవెన్యూ రికార్డులను సృష్టించి, ఆ భూమిని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించారని పోలీసులు దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో 1,500 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

# తుది దశకు మున్నేరు కేబుల్ బ్రిడ్జి

ఖమ్మం, జూన్ 6 (ఈవార్తలు): ఖమ్మం నగరంలో మున్నేరు నదిపై రూ.180 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులు ఫైనల్ దశకు చేరుకున్నాయి. కాల్వొడ్డు-జలగంనగర్ మధ్య మున్నేరు నదిపై 1.25 కిలోమీటర్ల పొడవున ఈ తీగల వంతెనను నిర్మిస్తున్నారు. 2 ఏళ్లుగా సాగుతున్న ఈ కేబుల్ బ్రిడ్జి.. పనులు పూర్తి కావస్తున్నాయి. ఈ వంతెనలో రెండు బాహుబలి పిల్లర్లను ఏర్పాటు చేసి.. వాటి ఆధారంగా స్టీల్ తీగలపై ఈ బ్రిడ్జిని నిర్మించారు. ఇక నది ప్రాంతంలో 300 మీటర్ల పొడవున వంతెన భాగం తీగలపై వేలాడుతూ ఉంటుంది.



# రూ.29 పెరిగిన వంట గ్యాస్

### మూడ్నెల్లలో రెండోసారి పెరుగుదల

న్యూఢిల్లీ:మరోసారి గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధర పెరిగింది. సిలిండర్ ధరను రూ.29 మేర పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. మూడు నెలల వ్యవధిలో డొమెస్టిక్ సిలిండర్ ధర పెరగడం ఇది రెండోసారి. దిల్లీలో 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 నుంచి రూ.942కు చేరింది. పెంచిన ధరలు నేటి (జూన్ 7) నుంచి అమల్లోకి రానున్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో మార్చి 7న గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధరను రూ.60 పెంచిన విషయం తెలిసిందే.

# లక్ష బొద్దింకలను పట్టేశారు

### ఆస్ట్రేలియాలో చరిత్రలోనే అతిపెద్ద ఆపరేషన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాలో అధికారులు జరిపిన ఒక భారీ ఆపరేషన్‌లో లక్షకు పైగా అక్రమ బొద్దింకలను స్వాధీనం చేసుకున్నారు. దేశంలోకి దిగుమతి చేసుకోవడం లేదా పెంచడంపై నిషేధం ఉన్న ఈ బొద్దింకలను ఒకే బ్రీడర్ నుంచి పట్టుకోవడం సంచలనం సృష్టిస్తోంది. దేశ చరిత్రలో అకశేరుకాలకు (వెన్నెముక లేని జీవులు) సంబంధించి ఇదే అతిపెద్ద ఆపరేషన్ అధికారులు వెల్లడించారు. న్యూసౌత్ వేల్స్ రాష్ట్రంలోని బాథర్స్ట్ నగరంలో మే నెలలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఒక కమర్షియల్ బ్రీడర్ వద్ద జరిపిన సోదాల్లో మడగాస్కర్ హిస్సింగ్, దూబియా జాతులకు చెందిన లక్షకు పైగా బొద్దింకలను గుర్తించినట్లు ఆస్ట్రేలియా పర్యావరణ విభాగం తెలిపింది. వీటి విలువ సుమారు 200,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1.35 కోట్లు) ఉంటుందని అంచనా. ఈ మడగాస్కర్ బొద్దింకలు ప్రపంచంలోనే అతిపెద్ద జాతులలో ఒకటి. ఇవి 5 నుంచి 8 సెంటీమీటర్ల పొడవు ఉంటాయి. సాధారణ ఆస్ట్రేలియన్ బొద్దింకల కన్నా ఇవి చాలా పెద్దవి. స్థానికంగా పాములను పట్టే స్టెఫానీ లెస్సర్ మాట్లాడుతూ, పెంపుడు సరీసృపాలకు తక్కువ ఖర్చుతో కూడిన ఆహారం అందించేందుకు ఈ పెద్ద బొద్దింకలను అమ్ముతున్నారని అభిప్రాయపడ్డారు. ఆస్ట్రేలియాలో కఠినమైన బయోసెక్యూరిటీ నిబంధనలు అమల్లో ఉన్నాయి. దేశీయ వృక్ష, జంతుజాలాన్ని కాపాడేందుకు ఇలాంటి విదేశీ జీవులను పెంచడం, అమ్మడం చట్టవిరుద్ధం. విదేశీ బొద్దింకలు పర్యావరణానికి ప్రమాదకరం కావచ్చని, స్థానిక జీవవైవిధ్యానికి హాని కలిగించడంతో పాటు వ్యాధులను వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అయితే, బాథర్స్ట్‌కు చెందిన బ్రీడర్‌పై ప్రస్తుతానికి ఎలాంటి అభియోగాలు నమోదు చేయలేదని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బొద్దింకలన్నింటికీ కారుణ్య మరణం విధించనున్నట్లు వారు పేర్కొన్నారు.

# లాలూ, రబ్రీలకు జడ్ ప్లస్ ఉపసంహారణ

పాట్నా: మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్ , ఆయన సతీమణి రబ్రీదేవిలకు బిహార్ ప్రభుత్వం జడ్ ప్లస్ కేటగిరీ భద్రతను ఇటీవల ఉపసంహరించుకుని, ప్రత్యేక సాయుధ పోలీసులతో భద్రత కల్పించింది. అయితే ఈ చర్యను లాలూ కుటుంబం తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. తమకు ప్రభుత్వం కేటాయించిన భద్రత వద్దంటూ ఇంటి నుంచి పోలీసులను పంపేసింది. దీంతో పాట్నాలోని 10- సర్క్యులర్ రోడ్‌లోని సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఇక, బిహార్ ప్రతిపక్ష నేత హోదాలో లాలూ కుమారుడు తేజస్వీయాదవ్‌కు వై-ప్లస్, అలాగే ఎంపీ మిసా భారతికి ఉన్న భద్రతను యథావిధిగా కొనసాగించనున్నట్లు బిహార్ ప్రభుత్వం ప్రకటించింది.

## 'వియ్ ది లీడర్స్'కు

# బ్రహ్మారథం



### 24 గంటల్లో 14 లక్షల మంది చేరిక

### అన్నామలై రాజకీయ ఉద్యమానికి బాసట

***తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఐపీఎస్ అధికారి కె. అన్నామలై బీజేపీకి రాజీనామా చేసి సంచలనం సృష్టించారు. జూన్ 5న పార్టీ ఆయన రాజీనామాకు ఆమోదం తెలిపిందే. వెంటనే ఆయన 'వియ్ ది లీడర్స్' పేరుతో నూతన రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.***

చెన్నై: ఈ ఉద్యమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. ప్రారంభించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే సుమారు 14 లక్షల మంది ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావడం గమనార్హం. గత కొంతకాలంగా పార్టీ రాష్ట్ర వ్యూహాల విషయంలో అధిష్ఠానంతో విభేదిస్తున్న అన్నామలై, చివరకు పార్టీని వీడాలని నిర్ణయించుకున్నారు. తన రాజీనామా లేఖను బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు పంపగా, ఆయన దానిని నిన్న ఆమోదించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పట్ల తనకు అమితమైన గౌరవం ఉందని, అయితే పార్టీని మరింత ఇబ్బంది పెట్టడం ఇష్టం లేకనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నామలై తన లేఖలో పేర్కొన్నారు. 'సింగం'గా గుర్తింపు పొందిన ఆయన, 2020లో సివిల్ సర్వీసెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. రాజకీయల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే, 37 ఏళ్ల వయసులో రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి రికార్డు సృష్టించారు. 'వియ్ ది లీడర్స్' ఉద్యమం ద్వారా తమిళనాడులో వారసత్వ, వ్యక్తిపూజ రాజకీయాలకు స్వస్తి పలికి, సమర్థవంతమైన ప్రత్యామ్నాయాన్ని తీసుకురావడమే తన లక్ష్యమని అన్నామలై ప్రకటించారు. విద్య, ఆరోగ్యం, యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తామని తెలిపారు. దివంగత రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాల స్ఫూర్తితో ఈ ఉద్యమాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. అన్నామలైకి మద్దతుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్‌తో సహా పలువురు కీలక నేతలు కూడా బీజేపీని వీడారు. ఈ నూతన ఉద్యమం రానున్న లోక్‌సభ ఎన్నికల నాటికి పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా ఆవిర్భవించే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# మేనల్లుడి సీటుకు మమత ఎసరు

### అభిషేక్ సీటు పక్కన మరో ఇద్దరు

### టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా మరో ఇద్దరు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పార్టీ ఆవిర్భావం తర్వాత మొదటిసారి తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పరిస్థితి చేజారుతుండటంతో అధినేత్రి మమతా బెనర్జీ చక్కదిద్దుకునేందుకు చర్యలకు ఉపక్రమించారు. సంస్థాగతంగా పార్టీని 360 డిగ్రీల్లో ప్రక్షాళనకు నడుంబిగించారు. ఇందులో భాగంగా పార్టీలో అసంతృప్తికి, తిరుగుబాటుకు ప్రధాన కారణమైన తన మేనల్లుడు, టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ రెక్కలు కత్తిరించారు. ఒకప్పుడు ఆయన మాటే శాసనంగా సాగిన అభిషేక్.. ఇకపై మరో ఇద్దరు జాతీయ ప్రధాన కార్యదర్శులతో కలిసి పనిచేయాల్సి ఉంటుంది. తన సన్నిహిత ఎంపీలు డెరెక్ ఓబ్రెయిన్, దోలా సేన్‌లను ఆ స్థానంలో నియమించింది. ఏదైనా నిర్ణయాన్ని ముగ్గురు కలిసి తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో అభిషేక్ కూడా చర్యలకు అతీతుడు కాదనే సందేశం దీదీ పంపారు. తృణమూల్‌లో ప్రస్తుత తిరుగుబాటును, మమతా బెనర్జీకి కంటే ఎక్కువగా అభిషేక్ బెనర్జీకి వ్యతిరేకంగా జరిగిన తిరుగుబాటుగా చూస్తున్నారు. అసెంబ్లీ ఫలితాల తర్వాత జరిగిన ఒక సమావేశంలో ఎన్నికల్లో తన మేనల్లుడి పాత్రను అభినందించాలని నాయకులను మమతా బెనర్జీ కోరినట్లు సమాచారం. పార్టీ ప్రజాదరణ కోల్పోవడానికి అభిషేక్ బెనర్జీ వైఖరే ప్రధాన కారణమని భావించిన చాలా మందికి ఈ చర్య ఆగ్రహం తెప్పించిందని వర్గాలు తెలిపాయి. తిరుగుబాటుకు మొదటి బీజం అక్కడే పడి, ఆ క్షణం నుంచే టీఎంసీ శాసనసభ పక్షంలో చీలికలు మొదలయ్యాయి. మే 19న కాళీఘాట్‌లో జరిగిన మరో భేటీలో రెబల్స్ రీటాబ్రత బెనర్జీ, సాందీపన్ సాహా తొలిసారి బహిరంగంగా తమ అసమ్మతి బయటపెట్టారు. ఈ అసమ్మతి పూర్తిస్థాయి తిరుగుబాటుగా పరిణమించింది. దీంతో మమతా బెనర్జీ సంస్థాగత నిర్మాణంలో మార్పులు తీసుకొచ్చి, దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇతర ముఖ్య నియామకాల్లో సీనియర్ నాయకురాలు చంద్రమా భట్టాచార్య రాష్ట్ర అధ్యక్షురాలిగా పదోన్నత కల్పించారు. ఇది పార్టీలో కొత్తతరం, సంస్థాగత పునర్వ్యవస్థీకరణకు సంకేతంగా నిలిచింది. సుబ్రతా బక్షి జాతీయ కార్యవర్గంలో ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అలాగే, పార్టీలోని అన్ని విభాగాల్లోనూ కొత్త ముఖాలను తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్ టీఎంసీ ఉపాధ్యక్షులుగా సజ్దా అహ్మద్, మమతా ఠాకూర్, నయనా బందోపాధ్యాయ్, స్వాతి ఖండేకర్‌లను నియమించారు.

# హెచ్‌జెడ్‌ఎల్‌లో కేంద్రం వాటా అమ్మకం!

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వానికి.. పలు ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు సహా ఇతర ప్రైవేట్ కంపెనీలు, బ్యాంకుల్లోనూ కొద్ది మొత్తం వాటాల్ని కలిగి ఉన్న సంగతి తెలిసిందే. అంటే గతంలో ప్రభుత్వ సంస్థల్ని ప్రైవేటీకరణ చేసినా.. కొంత మేర వాటాల్ని అట్టిపెట్టుకుంది. అయితే ఇప్పుడు మిగతా మైనార్టీ వాటాల్ని కూడా విక్రయించేందుకు సిద్ధమవుతోంది. తాజాగా దేశంలోనే దిగ్గజ వెండి, సీసం ఉత్పత్తిదారు కంపెనీ అయిన హిందుస్థాన్ జింక్ లిమిటెడ్‌లో వాటా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇందులో తమ వాటాలో సుమారు 2 శాతం వాటాను విక్రయించాలని చూస్తున్నట్లు రిపోర్ట్స్ వచ్చాయి. దాదాపు వాటా విక్రయం ద్వారా రూ. 5 వేల కోట్ల వరకు నిధులు ఖజానాకు వస్తాయని భావిస్తున్నారు.

## వంట మనిషి తప్పిదం వల్లే

# 21 మంది బలి

### ఢిల్లీ పోలీసుల దర్యాప్తులో ఘోర నిజాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని మాల్వియా నగర్‌లో ఉన్న 'స్టే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్' హోటల్‌లో సంభవించిన భయంకరమైన అగ్నిప్రమాదం గురించి అందరికీ తెలిసిందే. ఈ ఘోర దుర్ఘటనలో 21 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోగా.. దీనిపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే విచారణ జరుపుతున్న ఢిల్లీ పోలీసులకు విస్తుపోయే విషయాలు తెలిశాయి. ముఖ్యంగా హోటల్‌లో ప్రధాన వంట మనిషిగా పనిచేస్తున్న కేశవ్ నేగిని చేసిన చిన్న తప్పిదం వల్లే ఈ ప్రమాదంలో అంత మంది చనిపోయారని గుర్తించారు. ఈక్రమంలోనే అతడిని అరెస్ట్ చేశారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు కేశవ్ నేగి వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన రోజు వంటగదిలో అతడు ఎలక్ట్రిక్ స్టవ్‌ను ఆన్ చేయగానే అది ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. దాంతో కిచెన్ అంతా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో తీవ్ర భయాందోళనకు గురైన కేశవ్.. మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించాల్సింది పోయి, తన ప్రాణాలను రక్షించుకునేందుకు హోటల్లోని మెయిన్ పవర్ సప్లైను పూర్తిగా ఆపివేశాడు. ఆ తర్వాత వెంటనే హోటల్ నుంచి బయటకు పరుగులు తీశాడు. అయితే అతడు చేసిన ఈ ఒక్క పొరపాటే హోటల్‌లో ఉన్న మిగతా వారికి మరణశాసనంగా మారింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో హోటల్‌లోని సెంట్రల్ లాకింగ్ సిస్టమ్, ఎలక్ట్రానిక్ తలుపులు, ఇతర పరికరాలు పూర్తిగా పనిచేయడం ఆగిపోయాయి. ఫలితంగా గదుల్లో ఉన్న కస్టమర్లు బయటకు రాలేక, తలుపులు తెరుచుకోక లోపలే చిక్కుకుపోయారు. ఈ క్రమంలోనే హోటల్ బాత్రూమ్ తలుపులు లాక్ అయిపోవడంతో.. లోపల ఉన్న ఒక విదేశీ జంట ఊపిరాడక అక్కడికక్కడే మరణించినట్లు పోలీసు వర్గాలు నిర్ధారించాయి. ప్రస్తుతం కేశవ్‌తో పాటు హోటల్‌కు చెందిన మరికొంతమంది సిబ్బందిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.





## కొండగట్టు అంజన్న సేవలో అల్లోల

మల్యాల, జూన్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామిని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు చిన్న రాము, ప్రధాన అర్చకులు జితేందర్, పవన్ వేదోక్త మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ ఎస్. అంజనారెడ్డి శేషవస్త్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ, కొండగట్టు క్షేత్రం తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, రైతులు, యువత, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, టెంపుల్ సూపరింటెండెంట్ సునీల్, చంద్రశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.



## ఉద్యమంలా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

**మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత**

బాల్కొండ, జూన్ 6 (ఈవార్తలు): బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి విజయవంతం చేయాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్‌పర్సన్, బాల్కొండ నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి దావ వసంత పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం, ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచనల మేరకు ప్రతి కార్యకర్త ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు చేపట్టాలని, పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని అన్నారు. సభ్యత్వ నమోదులో ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇన్‌చార్జి వీజీ గౌడ్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే, జిల్లా అధ్యక్షుడు జీవన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్యే సురేందర్, బీసీ నాయకుడు రాజారాం యాదవ్, మండల అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, మాజీ, ప్రస్తుత ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## యువతకు శివాజీ ఆదర్శం: అడ్లూరి

ఎండపల్లి, జూన్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివాజీ మహారాజ్ వీరయోధుడని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విగ్రహ నిర్మాణానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శివాజీ పోరాటాల ఫలితంగానే నేడు స్వేచ్ఛగా జీవిస్తున్నామని పేర్కొన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని సాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. మేడారం రిజర్వాయర్ నుంచి కొత్తపేట వరకు 11 గ్రామాలకు సాగునీటి పనులు త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలకు నీరందించే 11ఎల్ కాలువ పనులు కూడా చేపడుతున్నట్లు చెప్పారు. పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి ఎత్తిపోతల పథకం, రోళ్ళవాగు ప్రాజెక్టుల కోసం ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. కొత్తపేట సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేందర్ రెడ్డి, రాంబాబు, హనుమంతరావు పాల్గొన్నారు.



## ఘనంగా విలేకరి సులేమాన్ పాషా వలిమా

జగిత్యాల టౌన్, జూన్ 6 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని సలీమా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో రిపోర్టర్ సులేమాన్ పాషా వలిమా (రిసెప్షన్) వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇమ్రాన్, టీవీ సూర్యం, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు లియాకత్ అలీ మోసిన్, 99టీవీ రిపోర్టర్ మోసిక్, ఆంధ్రప్రభ మహమ్మద్ నజీమ్, మాజీ కౌన్సిలర్ గాజుల రాజేందర్ తదితరులు హాజరయ్యారు. వారు నూతన వధూవరులను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు. వలిమా వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు, జర్నలిస్టు మిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేటీఆర్‌వి డైవర్షన్ రాజకీయాలు

**దమ్ముంటే సింగరేణి అవినీతిపై విచారణ చేయించాలి.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ధ్వజం**



వెల్గటూర్, జూన్ 6 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేస్తున్నవి డైవర్షన్ రాజకీయాలేనని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో రూ.1,600 కోట్ల అవినీతి జరిగిందంటూ కేటీఆర్ చేసిన ఆరోపణలపై వెల్గటూర్‌లో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. సింగరేణిలో అవినీతి జరిగిందని నిజంగా ఆధారాలు ఉంటే కేంద్ర ప్రభుత్వానికి ఉత్తరాలు రాయడం కాకుండా, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా బీఆర్ఎస్‌కు సహకరిస్తున్న బీజేపీ ప్రభుత్వంతోనే విచారణ చేయించాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఆరోపణలు చేసి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం కాకుండా నిజానిజాలు బయటకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతోందని మంత్రి పేర్కొన్నారు. పార్టీ మనుగడను కాపాడుకునేందుకు కేటీఆర్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు దూరమై ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని, పార్టీ అంతర్గత పరిస్థితులు, కుటుంబ విభేదాల నేపథ్యంలో ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కేటీఆర్ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై మాట్లాడకుండా రాజకీయ ఆరోపణలతో కాలం గడపడం బీఆర్ఎస్ నాయకత్వ వైఫల్యానికి నిదర్శనమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వ్యాఖ్యానించారు.

# జగిత్యాలలో నీట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



జగిత్యాల, జూన్ 6 (ఈవార్తలు): నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్)-2026 పరీక్షకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ పరీక్ష జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.15 గంటల వరకు నిర్వహించనున్నారు. వికలాంగ అభ్యర్థులకు సాయంత్రం 6.15 గంటల వరకు అదనపు సమయం కల్పించారు. జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ ఇంజినీరింగ్ కళాశాల, నాచుపల్లి (కొడిమ్యాల మండలం)లో రెండు కేంద్రాలు, ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, జగిత్యాలలో ఒక కేంద్రం ఏర్పాటు చేశారు. మొత్తం 807 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ బి.ఎస్.లత, జిల్లా విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, పోస్టల్ శాఖల అధికారులు, నీట్ సిటీ కోఆర్డినేటర్, కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

# రేవంత్‌కు 'మహా' సీఎం అపాయింట్‌మెంట్ ఇస్తలే!

**కాళేశ్వరం పిల్లర్లు రిపేర్ చేసుడు శాతనైతలే.. కాంగ్రెస్ ప్రభుత్వంపై జీవన్ రెడ్డి తీవ్ర విమర్శలు**



జగిత్యాల, జూన్ 6 (ఈవార్తలు): మహారాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ కూడా లభించలేని పరిస్థితి ఉందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఎద్దేవా చేశారు. జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ప్రాజెక్టు అని పేర్కొన్న ఆయన, కూలిన పిల్లర్ల మరమ్మతులు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అసమర్థంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని అన్నారు. తెలంగాణ భవిష్యత్తు బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ నాయకత్వంతోనే ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ లేకుండా రాష్ట్ర అభివృద్ధి సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మూడు లక్షల ఉద్యోగాల హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పాలనపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర స్థాయిలో విమర్శలు కొనసాగిస్తూ, రాష్ట్ర అభివృద్ధి కంటే రాజకీయాలపైనే దృష్టి పెట్టారని ఆరోపించారు. పొరుగు రాష్ట్రాలతో సమన్వయం లోపించడంతో ప్రాజెక్టుల పురోగతి నిలిచిపోయిందని వ్యాఖ్యానించారు. మొత్తం మీద రాష్ట్ర భవిష్యత్తు బీఆర్ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు మళ్లీ గుర్తిస్తున్నారని జీవన్ రెడ్డి అన్నారు.

# 18 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక

**పూర్వ విద్యార్థుల సందడి**



సిద్దిపేట, జూన్ 6 (ఈవార్తలు): కాలం మారినా, బాధ్యతలు పెరిగినా విద్యార్థి దశలో ఏర్పడిన స్నేహబంధాలు మాత్రం చెదరిపోవని మరోసారి నిరూపితమైంది. స్థానిక జెడ్పీహెచ్ఎస్ తడ్కపల్లి పాఠశాలలో 18 ఏళ్ల తర్వాత నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరిగింది. దాదాపు రెండు దశాబ్దాల అనంతరం కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు చూసుకుని భావోద్వేగానికి గురయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ పరస్పరం ఆప్యాయంగా పలకరించుకున్నారు. కొందరు మిత్రులు ఆనందభాష్పాలు కార్చగా, మరికొందరు పాఠశాల రోజులలో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ నవ్వుల్లో మునిగిపోయారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల పాదాలకు నమస్కరించి ఆశీస్సులు పొందారు. నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడటం ఆనందంగా ఉందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు తమ ప్రస్తుత ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ విశేషాలను పంచుకున్నారు. పరస్పర అనుబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి గ్రూప్ ఫోటోలు, సెల్ఫీలు దిగుతూ మధుర జ్ఞాపకాలను స్మరించుకున్నారు. చివరగా భవిష్యత్తులో మరిన్ని సార్లు ఇలాంటి సమ్మేళనాలు నిర్వహించాలని నిర్ణయించుకుని వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఆనందయ్య, విఠల్, శ్యాంసుందర్, బాల్‌లింగం, నరసింహచారి, సదానందరెడ్డి, సుమిత్రతో పాటు పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



## మహిళల భద్రతపై షీ-టీం అవగాహన

జగిత్యాల టౌన్, జూన్ 6 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా జగిత్యాల టౌన్ పోలీసుల షీ-టీం ఆధ్వర్యంలో మహిళల భద్రత, రక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్త బస్టాండ్, రైతు మార్కెట్ ప్రాంతాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ నాయకత్వం వహించారు. షీ-టీం సిబ్బంది మహిళలు, యువతులు, విద్యార్థినులకు మహిళల రక్షణకు సంబంధించిన సేవలు, చట్టపరమైన హక్కులు, అత్యవసర సహాయ నంబర్లపై అవగాహన కల్పించారు. మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్, సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100/112, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం. సుప్రియ, షీ-టీం సిబ్బంది, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.



## వరి కొయ్యలు కాల్చిన 8 మంది రైతులకు జరిమానా

**కథలాపూర్ మండలంలో ఒక్కొక్కరికి రూ.5 వేల ఫైన్**

కథలాపూర్, జూన్ 6 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో వరి కొయ్యలు కాల్చిన రైతులపై అధికారులు చర్యలు చేపట్టారు. కథలాపూర్ మండలం రాజారం తండా గ్రామానికి చెందిన 8 మంది రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో వరి కొయ్యలు కాల్చినట్లు గుర్తించిన అధికారులు, ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. వరి కొయ్యలు, పంట అవశేషాలను కాల్చరాదని వ్యవసాయ శాఖ పలుమార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ రైతులు నిబంధనలు ఉల్లంఘించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ తెలిపారు. గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సమక్షంలో విచారణ నిర్వహించి జి.ఓ. ఎం.ఎస్. నం.27 ప్రకారం జరిమానాలు విధించినట్లు వెల్లడించారు. పంట అవశేషాలను కాల్చకుండా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించడం ద్వారా నేల సారాన్ని కాపాడడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని రైతులకు సూచించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## ఊరు బాగుంటేనే దేశం బాగు

**ప్రతి ఇల్లు పరిశుభ్రంగా ఉండాలి.. వర్షకాలం వస్తోంది జాగ్రతలు తీసుకోండి**

**ప్రజలకు మల్యాల ఎంపీడీవో సూచనలు**

మల్యాల, జూన్ 6 (ఈవార్తలు): ఊరు బాగుంటేనే దేశం బాగుంటుందని మల్యాల ఎంపీడీవో అన్నారు. ప్రతి ఇల్లు పరిశుభ్రంగా ఉండాలని, ముఖ్యంగా వర్షకాలం వస్తున్న నేపథ్యంలో అంతా పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శనివారం మల్యాల మండలం బల్వంతాపూర్‌లో ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన ఆమె.. సురక్షితమైన తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ, జల సంరక్షణ, మొక్కల పెంపకం, ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, వరద నిర్వహణ, మహిళల సంరక్షణ గురించి వివరించారు. 'అరైవ్-అలైవ్'పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, సీసీ, వీవో అధ్యక్షురాలు, వీవోఏ, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేటి ఈవార్తలు

**COMMERCIAL RATE CARD**

**DISPLAY ADVERTISEMENTS**
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
| --- | --- | --- |
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

**CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:**


**BLACK & WHITE:**
Price for 5 Lines – Rs.450
(for each extra line – Rs.90)

**COLOUR:**
Price for 5 Lines – Rs.500
(for each extra line – Rs.100)

Phone: +91 94404 55811 | Email: contact@evarthalu.com

## లవ్లీ చిత్రం





# 'రణబాలి' టాకీ పార్ట్ 90 శాతం పూర్తి

విజయ్ దేవరకొండ నటిస్తున్న చిత్రాల్లో 'రణబాలి' ఒకటి. ఇందులో ఆయన భార్య రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోంది. రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనుండగా.. టీ సిరీస్ సమర్పణలో, మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇది 19వ సెంచరీ నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా రాబోతోంది. తాజాగా, 'రణబాలి' సినిమా సక్సెస్‌ఫుల్‌గా వంద రోజుల షూటింగ్ పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా, ఈ చిత్రానికి సంబంధించిన 90% (తొంభై శాతం) టాకీ పార్ట్ షూటింగ్ కూడా పూర్తయినట్లు మేకర్స్ అధికారికంగా వెల్లడించారు. ఇటీవల వైఎస్ఆర్ కడప జిల్లాలోని చారిత్రక ప్రాంతమైన గండికోటలో ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసినట్లు వెల్లడించారు. కాగా.. ఈ మూవీతో పాటు విజయ్ దేవరకొండ 'రౌడీ జనార్ధన' లో కూడా చేస్తున్నారు. వరుస సినిమాలతో ఫుల్ బిజీ అయిపోయారు.

# హీరోయిన్లను నిందించడం ఆపండి: ఆషికా రంగనాథ్

కన్నడ బ్యూటీ ఆషికా రంగనాథ్ తెలుగులో కూడా పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం తెలుగు, తమిళం, కన్నడ భాషల్లో బిజీగా ఉన్న ఈ నటి, మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' చిత్రంలో కీలక పాత్రలో కనిపించనుంది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ పలు విషయాలపై తనదైన శైలిలో రియాక్ట్ అవుతోంది. తాజాగా ఆషికా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ సినిమా ఇండస్ట్రీలో పెద్ద దుమారం రేపుతోంది. మూవీస్‌లో హీరోయిన్ల పాత్రలు, వారిపై వచ్చే విమర్శల గురించి ఆమె చాలా ఓపెన్‌గా మాట్లాడింది. హీరోయిన్ పాత్ర సరిగ్గా లేనప్పుడు విమర్శకులు నటీమణులపైనే నిందలు వేస్తారని ఆషికా రంగనాథ్ అన్నారు. "కథ రాసేటప్పుడే మహిళా పాత్రలను పక్కన పెట్టేయడం లేదా వాటిని సరిగ్గా డిజైన్ చేయకపోవడం అసలు సమస్య. అంతే తప్ప నటీమణుల తప్పు ఏమీ లేదు. డైరెక్టర్లు తమకు ఇచ్చిన పరిధిలోనే వాళ్ళు నటిస్తారు. రామ్ చరణ్




లేదా జూనియర్ ఎన్టీఆర్ వంటి పెద్ద స్టార్ల సరసన కేవలం డబ్బు కోసమే హీరోయిన్లు నటిస్తున్నారని కొందరు విమర్శిస్తుంటారు. కానీ ఈ పెద్ద సినిమాల వెనుక ఉండే బిజినెస్ మార్కెట్ గురించి ఎవరూ ఆలోచించరు. ఇక నుంచి అయినా నిందించడం ఆపండి" అని ఆమె చెప్పారు. తెలుగు వంటి పెద్ద పాన్-ఇండియా సినిమాల్లో నటించడం అనేది హీరోయిన్లకు తమ నటనను నిరూపించుకునే అవకాశం కంటే, కెరీర్‌లో పైకి ఎదగడానికి ఒక ప్లాన్ లాంటిదని ఆషికా అభిప్రాయపడ్డారు.



# ఈ స్టోరీ నా కోసం రాయలేదు

స్టార్ నటి సమంత తన సొంత బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా తన భర్త రాజ్ నిడిమోరుతో కలిసి నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఇందులో సమంత ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుంది. పలు వాయిదాల తర్వాత భారీ అంచనాల మధ్య ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ జూన్ 19న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. ప్రమోషన్స్‌లో జోరు పెంచారు చిత్ర బృందం. ఈ క్రమంలోనే తాజాగా ఓ సెల్ఫీ వీడియో రిలీజ్ చేసిన సమంత ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకుంది. 'నిజానికి ఈ సినిమాను నేను ఎంపిక చేసుకోలేదు. ఈ మూవీనే నన్ను ఎంపిక చేసుకుంది. ఈ చిత్రాన్ని ఫీమేల్ ఓరియెంటెడ్‌గా తెరకెక్కించాలి అనుకున్నప్పుడే ఇందులో సాయి పల్లవిని హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ తను చాలా బిజీగా ఉండటం, డేట్స్ కుదరకపోవడంతో మేకర్స్ ఈ సినిమా స్టోరీని నాకు తగ్గట్టుగా మార్చారు. చాలా హోప్‌తో ఈ మూవీలో నటించాను. అంతే కాదు.. ఈ ఫీమేల్ ఓరియెంటెడ్ మూవీ చూసి చాలా మంది ఫీమేల్ యాక్టర్స్ ఇన్స్‌పయర్ అవుతారు. త్వరలోనే వారు కూడా ఇలాంటి చిత్రాల్లో నటించాలని అనుకుంటారు. మా 'మా ఇంటి బంగారం' జూన్ 19న రాబోతున్నది.. థియేటర్స్‌లో కలుద్దాం' అంటూ చెప్పుకొచ్చింది.

# అప్‌డేట్ ఇస్తా



'ఆర్ఎక్స్-100' చిత్రంతో టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీగా మారిపోయింది పాయల్ రాజ్‌పుత్. ఆ తర్వాత కూడా డిఫరెంట్ కంటెంట్ ఉన్న సినిమాలు ఎంచుకుంటూ ప్రస్తుతం హీరోయిన్‌గా రాణిస్తున్న ఈ అమ్మడు.. ప్రజెంట్ 'వెంకటలచ్చిమి' అనే సినిమాలో నటిస్తుంది. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కుతోన్న ఈ మూవీని ముని దర్శకత్వంలో 'సినిమా టికెట్ ఎంటర్‌టైన్మెంట్స్ అండ్ అర్జున్ ఆర్ట్స్ బ్యానర్లపై రాజా, ఎన్ఎస్ చౌదరి నిర్మిస్తున్నారు. ఇదొక పవర్‌ఫుల్ యాక్షన్ రివెంజ్ డ్రామా అని తెలుస్తుండగా.. తెలుగుతో పాటు హిందీ, పంజాబీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో మొత్తం 6 భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాపై అప్డేట్ ఇచ్చింది పాయల్. 'ఈ సినిమా కోసం నేను ఎంతో ఈగర్‌గా వెయిట్ చేస్తున్నా. అలాగే నా కొత్త సినిమాలకు సంబంధించిన అప్డేట్స్ కూడా త్వరలోనే ప్రకటిస్తాను. నా కోసం ప్రేక్షకులు వెయిట్ చెయ్యడం కాదు.. నేనే వాళ్లు నన్ను ఎప్పుడు బిగ్ స్క్రీన్‌పై చూస్తారా అని వెయిట్ చేస్తున్నా.. కచ్చితంగా 10, 15 రోజుల్లో నా నుంచి మీకు ఒక బిగ్ అప్డేట్ అయితే రాబోతున్నది' అని చెప్పుకొచ్చింది.




# జూలైలో దుల్కర్ 'ఆకాశంలో ఒక తార' రిలీజ్!

'మహానటి', 'లక్కీ భాస్కర్' వంటి బ్లాక్ బస్టర్ హిట్ల తర్వాత మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ చేస్తున్న.. ప్రతిష్టాత్మక తెలుగు చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్ సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్టుపై తెలుగు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అయితే.. ఈ మూవీ అనౌన్స్ చేసి చాలా కాలం అవుతున్నప్పటికీ ఇందులో నుంచి సరైన అప్డేట్స్ మాత్రం రావడం లేదు. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించిన ఓ సాలిడ్ అప్డేట్ వచ్చింది. ఆకాశంలో ఒక తార సినిమా రీసెంట్ షెడ్యూల్ హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫిల్మ్ ఫ్యాక్టరీలో పూర్తి చేసుకుందట. అంతే కాకుండా.. ఈ చిత్రాన్ని జులై నెలలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తుండగా ఆ దిశగా షూటింగ్‌లో వేగం పెంచి పనులు పూర్తి చేసుకుంటున్నారని తెలుస్తుంది.

# నేడు స్లమ్ డాగ్ టీజర్ రిలీజ్

దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన లైగర్, డబుల్ ఇస్మార్ట్ అతడికి ఆశించిన విజయాలను అందించలేదు. అందుకే ఇప్పుడు అతడు కచ్చితంగా కంబ్యాక్ కోసం ఏదైనా కొత్తగా చేస్తున్నాడని అభిమానులు ఆశిస్తున్నారు. దానికి తగ్గట్టే బాక్సాఫీస్ వద్ద సరైన విజయం కోసం ఆకలితో ఆవురావురుమంటూ ఎదురుచూస్తున్నారు పూరి. ఆయన మళ్లీ ఫామ్‌లోకి రావాలంటే కేవలం ఒక క్రేజీ టీజరో, అదిరిపోయే ట్రైలరో సరిపోదు.. ఏకంగా థియేటర్లలో బొమ్మ దద్దరిల్లేలా బంపర్ హిట్టు కొట్టాల్సిందే. ఇలాంటి కీలక పోరాటంలో ఉన్న పూరీకి వైవిధ్యమైన నటనతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న జాతీయ ఉత్తమనటుడు విజయ్ సేతుపతి రూపంలో గొప్ప అవకాశం దక్కింది. వీరిద్దరి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా -స్లమ్ డాగ్- (సబ్‌టైటిల్: 33 టెంపుల్ రోడ్) పై ట్రేడ్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




# రాత్రిపూట నెటిజన్లు మారిపోతారు: రష్మిక

రష్మిక తనపై వచ్చే నెగటివిటీ గురించి మనసు విప్పి మాట్లాడారు. ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఉండే నటీనటులకు.. సాంకేతిక నిపుణులకు సోషల్ మీడియా అనేది ఒక వ్యసనంగా.. అదే సమయంలో ఒక శాపంగా ఎలా మారుతుందో చర్చించారు. వందలాది పాజిటివ్ కామెంట్స్ ఉన్నప్పటికీ ఎక్కడో ఒక మూల ఉండే ఒక్క నెగిటివ్ కామెంట్ మనశ్శాంతిని పూర్తిగా దెబ్బతీస్తుందని ఆ ఒక్క ట్వీట్ రోజంతా పడ్డ కష్టాన్ని, ఆనందాన్ని క్షణాల్లో దూరం చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే రష్మిక ఒక సక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సోషల్ మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటానని, అయితే సినిమాలు విడుదలైన సమయంలో ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటానని చెప్పారు. సినిమా రిలీజ్ రోజున పగలంతా వాతావరణం ఎంతో బాగుంటుందని, ప్రేక్షకుల నుండి సానుకూల స్పందన వస్తుందని పేర్కొన్నారు.





# తొలి రోజు టీమిండియాదే

## రాహుల్, గిల్ సెంచరీలు.. రాణించిన సాయి సుదర్శన్, పంత్

అఫ్గానిస్తాన్‌తో ఏకైక టెస్టులో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ముల్లాన్‌పూర్‌లో శనివారం ప్రారంభమైన టెస్టును ఘనంగా ఆరంభించింది. తొలి రోజు పూర్తిగా టీమిండియాదే.ఆరు నెలల తర్వాత ఒక టెస్టు మ్యాచ్ ఆడుతుండటంతో భారత ప్లేయర్లు ఏ విధంగా రాణిస్తారో అన్న అనుమానాలు ఉండే.

**అలాగే మొన్నటివరకు టీ20 ఫార్మాట్ ఆడిన వారు టెస్టు ఫార్మాట్‌కు తమ ఆటను మార్చుకుంటారా? అన్న సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. కానీ, టీమిండియా ఆటగాళ్లు ఏమాత్రం నిరాశపర్చలేదు. అద్భుతంగా బ్యాటింగ్ చేశారు. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 368 పరుగులు చేసింది.**



భారత్‌లో జరిగిన టెస్టు మ్యాచ్‌లో తొలి రోజు భారత్ చేసిన 4వ అత్యధిక స్కోరు ఇది. కేఎల్ రాహుల్(100), కెప్టెన్ శుభ్‌మన్ గిల్(103 నాటౌట్) శతకాలతో కదం తొక్కారు. సాయి సుదర్శన్(81), రిషబ్ పంత్(50 నాటౌట్) కూడా రాణించారు. దీంతో మొదటి రోజు బలమైన పునాది పడటంతో ఇండియా భారీ స్కోరుపై కన్నేసింది.

### ముందుగా రాహుల్, సుదర్శన్

ఓపెనర్ యశస్వి జైశ్వాల్(24) త్వరగానే అవుటవడంతో భారత్ 41 పరుగులకే తొలి వికెట్ కోల్పోయింది. టీమిండియాకు అదొక్క నిరాశ తప్ప తొలి రోజు అంతా ఏకపక్షమే. ఇటీవల ఐపీఎల్‌లో సత్తాచాటిన కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్ టెస్టు మ్యాచ్‌లోనూ తమ ఫామ్ కొనసాగించారు. మొన్నటివరకూ టీ20 ఫార్మాట్ ఆడిన వారు తమ ఆటను టెస్టులకు తగినట్టు మార్చుకుని ఆడారు. భారత్ ఇన్నింగ్స్‌కు మొదట పునాది వేసింది వీరే. క్రీజులో పాతుకపోయి అఫ్గాన్ బౌలర్లకు ముచ్చెమటలు పట్టించారు. వీరిద్దరూ దాదాపు 30 ఓవర్లపాటు బ్యాటింగ్ చేశారు. ఇద్దరూ పోటాపోటీగా ఫోర్లు దంచారు. ఈ క్రమంలోనే రాహుల్ టెస్టుల్లో 12 శతకం పూర్తి చేశాడు. అయితే, సెంచరీ చేసిన తర్వాతి బంతికే అతను అవుటవడం గమనార్హం. సాయి సుదర్శన్ కూడా తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. 81 పరుగుల వద్ద అవుటయ్యాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 139 రన్స్ పార్ట్‌నర్‌షిప్ జతచేశారు.

### పంత్‌తో కలిసి గిల్

రాహుల్, సుదర్శన్ జోరును కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కొనసాగించాడు. ఐపీఎల్ ఫామ్‌ను కొనసాగిస్తూ కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. ముందుగా రాహుల్‌తో కలిసి క్రీజులో పాతుకపోయాడు. రాహుల్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన పంత్ కూడా గిల్‌కు తోడయ్యాడు. వీరిద్దరూ కలిసి మరో భారీ భాగస్వామ్యాన్ని నిర్మించారు. ఒక్కరు తర్వాత ఒక్కరు భారత బ్యాటర్లు భారీ ఇన్నింగ్స్‌లు ఆడటంతో అఫ్గాన్ బౌలర్లకు ఏం చేయాలో అర్థం కాలేదు. వారి వ్యూహాల బెడిసికొట్టాయి. గిల్, పంత్ చాలా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. అబ్దుల్ మాలిక్ వేసిన 68వ ఓవర్‌లో పంత్ హ్యాట్రిక్ సిక్సర్లు కొట్టడం మ్యాచ్‌కే హైలెట్‌గా నిలిచింది. మరోవైపు, గిల్ కూడా ఫోర్ల మీద ఫోర్లు బాదాడు. ఈ క్రమంలోనే గిల్ సెంచరీ కూడా పూర్తి చేయగా.. పంత్ హాఫ్ సెంచరీని నమోదు చేశాడు. వీరిద్దరూ క్రీజులో పాతుకపోవడంతో భారత్ 400 స్కోరుకు చేరువైంది. తొలి రోజు ఆటను అజేయంగా ముగించగా.. గిల్ 103, పంత్ 50 పరుగుల వద్ద ఉన్నారు.



# ఫ్రెంచ్ ఓపెన్ విజేతగా మిరా ఆండ్రీవా

ఫ్రెంచ్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ లో రష్యన్ క్రీడాకారిణి, ఎనిమిదో సీడ్.. మిరా ఆండ్రీవా విజేతగా నిలిచారు. పారిస్ వేదికగా శనివారం (2026 జూన్ 06) జరిగిన ఫైనల్ పోరులో పోలెండ్‌కు చెందిన చ్వాలిన్‌స్కాపై 6-3, 6-2 తేడాతో విజయం సాధించింది. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా.. రెండు వరుస సెట్లలో ఆండ్రీవా ఆధిక్యం ప్రదర్శించింది. ఈ గెలుపుతో ఫ్రెంచ్ ఓపెన్ సాధించిన రెండో చిన్న వయస్కురాలిగా (19 ఏండ్లు) ఆండ్రీవా నిలిచింది. అంతకు ముందు ఈ రికార్డు 1992 లో 18 ఏళ్ల వయసులో టైటిల్ సాధించిన మోనికా సెలెస్ పైన ఉంది. 2014లో మరియా షరపోవా తర్వాత.. ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గిన రష్యా అమ్మాయిగా ఆండ్రీవా రికార్డ్ సృష్టించింది. ఆమెకు ఇది కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్.



# ఫిఫాలో సరికొత్త టెక్నాలజీ

**సెన్సర్ బంతి, ఏఐ అవతార్లు**

**రిఫరీలకు బాడీ కెమెరాలు, తప్పనిసరి హైడ్రేషన్ బ్రేక్స్**

**48 జట్లతో అతిపెద్ద టోర్నమెంట్‌గా రికార్డ్**

అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న 2026 ఫిఫా వరల్డ్ కప్ చరిత్రలోనే అతిపెద్దదిగా నిలవడమే కాకుండా, టెక్నాలజీ పరంగానూ ఓ విప్లవాన్ని తీసుకురాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), అత్యాధునిక సెన్సార్ల సహాయంతో ఆటలో పారదర్శకత పెంచేందుకు, అభిమానులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఫిఫా సిద్ధమైంది. ఈ టోర్నమెంట్ కోసం అడిడాస్ ప్రత్యేకంగా 'ట్రియోండా' అనే బంతిని రూపొందించింది. ఈ బంతి లోపల ఒక ఇనర్షియల్ మెజర్‌మెంట్ యూనిట్ (ఐఎంయూ) సెన్సార్ చిప్‌ను అమర్చారు. ఇది సెకనుకు 500 సార్లు బంతి కదలికలను, దాని వేగాన్ని, 3డీ స్పేస్‌లో అది ప్రయాణిస్తున్న తీరును రికార్డ్ చేస్తుంది. ఈ డేటాను నేరుగా వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) సిస్టమ్‌కు పంపుతుంది. తద్వారా ఆఫ్‌సైడ్, బంతి ఎవరికి తగిలింది వంటి వివాదాస్పద నిర్ణయాలను మరింత కచ్చితత్వంతో తీసుకోవచ్చు. లెనోవో భాగస్వామ్యంతో మరో ముందడుగు వేశారు. ప్రతి ఆటగాడిని కేవలం ఒక్క సెకనులో స్కాన్ చేసి, వారి శరీర కొలతలతో కూడిన కచ్చితమైన 3డి మోడళ్లను (అవతార్లను) సృష్టిస్తారు. ఈ ఏఐ ఆధారిత అవతార్లు సెమీ-ఆటోమేటెడ్ ఆఫ్‌సైడ్ టెక్నాలజీకి ఎంతగానో ఉపయోగపడతాయి. ఆటగాళ్లు గుంపులో ఉన్నా లేదా వేగంగా కదులుతున్నా, వారి కదలికలను కచ్చితంగా ట్రాక్ చేయడానికి ఇవి సహాయపడతాయి. ఈ అవతార్ల ద్వారా ఆఫ్‌సైడ్ నిర్ణయాలను అభిమానులకు మరింత స్పష్టంగా చూపించనున్నారు. వీటితో పాటు మరిన్ని మార్పులు కూడా ఉన్నాయి. ఆఫ్‌సైడ్ టెక్నాలజీని 10 సెం.మీ. కచ్చితత్వం వరకు మెరుగుపరిచారు. రిఫరీలకు రియల్ టైం ఆడియో హెచ్చరికలు అందుతాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో రిఫరీలు బాడీ కెమెరాలను ధరిస్తారు, ఇది అభిమానులకు మైదానంలో ఉన్న అనుభూతిని ఇస్తుంది. మెక్సికోలో భద్రత కోసం రోబో డాగ్స్‌ను కూడా వినియోగించనున్నారు. ఆటగాళ్ల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ, వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతి అర్ధ భాగంలో 22వ నిమిషం వద్ద 3 నిమిషాల హైడ్రేషన్ బ్రేక్ తప్పనిసరి చేశారు. మొత్తం 48 జట్లతో జరగనున్న ఈ అతిపెద్ద టోర్నమెంట్‌లో టెక్నాలజీ వినియోగం ఆటను మరింత నిష్పక్షపాతంగా మార్చడమే కాక, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానులకు ఒక సరికొత్త వీక్షణ అనుభవాన్ని అందించడం ఖాయం.



# కోహ్లీ స్థానంలో యశస్వీ జైస్వాల్

ఆఫ్ఘనిస్థాన్‌తో జరగబోయే రాబోయే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్టులోకి యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్‌ను సెలెక్టర్లు ఎంపిక చేశారు. గాయపడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ స్థానంలో అతణ్ని జట్టులోకి తీసుకుంటున్నట్లు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ శనివారం ప్రకటించారు. జైస్వాల్ తన చివరి వన్డేలో సౌతాఫ్రికాపై అజేయ సెంచరీ (116 పరుగులు)తో అదరగొట్టడం విశేషం. ఇదే సిరీస్‌లో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యాలు ఆడటం వారి ఫిట్‌నెస్ క్లియరెన్స్‌పైనే ఆధారపడి ఉంటుందని సెలెక్టర్లు స్పష్టం చేశారు. వెన్నునొప్పితో బాధపడుతున్న ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఇప్పటికే బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో రిహాబిలిటేషన్‌లో ఉండగా.. తొడ కండరాల గాయంతో బాధపడుతున్న రోహిత్ కూడా త్వరలో అక్కడికి చేరుకుని ఫిట్‌నెస్ పరీక్షకు హాజరుకానున్నాడు.

# వైభవ్ ఎంట్రీ ఇచ్చేశాడు!





## ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్‌కు ఎంపిక

టీమ్ఇండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లకు, ఏషియన్ గేమ్స్ కు భారత టీ20 జట్లను శనివారం ప్రకటించారు. ఈ ఎంపికలో అత్యంత ఆకర్షణీయమైన అంశం వైభవ్ సూర్యవంశీ ఎంపిక. ఈ ఏడాది జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన వైభవ్ ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున 237.30 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 776 పరుగులు సాధించి విధ్వంసం సృష్టించాడు. దాంతో 1989లో సచిన్ టెండూల్కర్ తర్వాత భారత జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా వైభవ్ రికార్డు సృష్టించాడు. అలాగే యువ ఆటగాడు తిలక్ వర్మను వైస్ కెప్టెన్‌గా నియమించడం ద్వారా భవిష్యత్తు నాయకుడిగా ఎదిగేందుకు అతనికి ఒక గొప్ప అవకాశం కల్పించామని అగార్కర్ వివరించారు. గాయం కారణంగా గత మార్చి నుంచి ఆటకు దూరమైన సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి రాగా.. లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ కూడా పునరాగమనం చేశాడు. ఐపీఎల్ 2026లో అదరగొట్టిన ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్లలో అవకాశం దక్కింది. అయితే జపాన్‌లోని నగోయాలో సెప్టెంబర్‌లో జరిగే ఆసియా క్రీడల జట్టులో ప్రిన్స్ యాదవ్ స్థానంలో స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా జట్టులోకి రానుండడం విశేషం. భారత జట్టు జూన్ 26, 28 తేదీల్లో బెల్ఫాస్ట్‌లో ఐర్లాండ్‌తో రెండు టీ20లు ఆడుతుంది. ఆ తర్వాత జూలై 1 నుంచి 11 వరకు ఇంగ్లాండ్‌లో ఐదు మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. సీనియర్ పర్యటనలకు ముందు వైభవ్ సూర్యవంశీ జూన్ 9 నుంచి 21 వరకు శ్రీలంకలో జరిగే ట్రై-సిరీస్‌లో ఇండియా-ఏ తరఫున బరిలోకి దిగనున్నాడు. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, నితీష్ కుమార్ రెడ్డి వంటి యువ ఆటగాళ్లతో భారత టీ20 జట్టు సరికొత్తగా ముస్తాబైంది.

**ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు భారత టీ20 జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, మహమ్మద్ సిరాజ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

**ఆసియా క్రీడలు-2026కు భారత టీ20 జట్టు:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, వైభవ్ సూర్యవంశీ, శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్.

# కెప్టెన్సీ పోయింది.. 'స్కై' ఆడేశాడు!



భారత టీ20 జట్టు కెప్టెన్సీ నుంచి సూర్యకుమార్ యాదవ్‌ను తొలగించారు. కెప్టెన్సీతో పాటు జట్టు నుంచి కూడా అతడికి ఉద్వాసన పలికారు. కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ పేరును ప్రకటించారు. త్వరలో ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లతో పాటు జపాన్‌లో జరిగే ఆసియా క్రీడల కోసం మూడు వేర్వేరు భారత జట్లను ఎంపిక చేశారు. ఈ మూడు జట్లలో స్కైకు చోటు లభించలేదు. తనపై వేటు పడిన తర్వాత కూడా హుందాగా వ్యవహరించి, కొత్తగా ఎంపికైన జట్టుకు శుభాకాంక్షలు తెలిపిన స్కై.. వేటు పడిన గంటల వ్యవధిలో బ్యాట్‌తో ఫైరయ్యాడు. టీ20 ముంబై లీగ్‌లో భాగంగా సోబో ముంబై ఫాల్కన్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో (రాత్రి) 24 బంతుల్లో 4 సిక్సర్లు, 3 ఫోర్ల సాయంతో 48 పరుగులు చేసి (ట్రయంప్ నైట్స్ ఎంఎన్ఈ కెప్టెన్‌గా) వీరంగం సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో స్కై ప్రత్యర్థి జట్టులో కొత్తగా ఎంపికై భారత టీ20 జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఉండటం మరో విశేషం.

# కాంస్యం పట్టిన భారత మహిళలు

**అండర్ 18 ఆసియా కప్‌లో కొరియాపై విన్**

జపాన్‌లో జరుగుతున్న మహిళల అండర్ 18 ఆసియాకప్ హాకీలో భారత జట్టుకు కాంస్య పతకం దక్కింది. మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో కొరియాపై విజయాన్ని నమోదు చేసింది. సందీప్ కుమారి, స్వీటీ కుజుర్, నౌషీన్ నాజ్‌లు భారత్ తరఫున గోల్స్ చేశారు. సెమీఫైనల్స్ మ్యాచ్‌లో చైనా చేతిలో షూటౌట్ ఓడిన భారత జట్టు బ్రాంజ్ మెడల్ ఫైట్‌లో గట్టిగా పోరాడింది. ఆరంభంలోనే డ్రీమ్ స్టార్ట్ అందింది. తొలి రెండు నిమిషాల్లోనే సందీప్ కుమారి గోల్స్ చేసింది. దీంతో ఇండియా ఈ మ్యాచ్‌లో దూకుడు ప్రదర్శించింది. మ్యాచ్ మొత్తం ఇండియా జట్టు అటాక్ చేసింది. ఇక ఆట 16వ నిమిషంలో స్వీటీ కుజుర్ ఫీల్డ్ గోల్‌తో ఆధిక్యాన్ని పెంచింది. రెండు గోల్స్‌తో భారత మహిళల జట్టు మ్యాచ్‌పై పట్టు సాధించింది. ఆ తర్వాత మళ్లీ 33వ నిమిషంలో భారత్‌కు మరో గోల్ దక్కింది. నౌషీన్ ఆ గోల్ స్కోరు చేసింది. ఈ టోర్నీలో నౌషీన్ తన ఖాతాలో మొత్తం 12 గోల్స్ వేసుకున్నది. సందీప్ కుమారి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నది.



నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# పాలన పక్కదారి

ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలు ఇస్తారు. అదే ప్రజలు అవసరమైతే తిరిగి తీసుకునే హక్కును కూడా కలిగి ఉంటారు. అందుకే ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు తమ మాటల్లో, చేతల్లో సంయమనం పాటించాల్సిన బాధ్యత ఉంటుంది. ముఖ్యంగా రాష్ట్రానికి నాయకత్వం వహించే ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి మాట్లాడే ప్రతి మాట ప్రభుత్వ వైఖరికి ప్రతిబింబంగా మారుతుంది. కానీ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు, వాడుతున్న భాష రాజకీయ వర్గాల్లోనే కాకుండా సాధారణ ప్రజల్లో కూడా చర్చనీయాంశంగా మారుతున్నాయి. విమర్శలను ఎదుర్కోవడం ప్రజాస్వామ్యంలో సహజం. ప్రతిపక్షాలపై రాజకీయంగా ఎదురుదాడి చేయడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే. అయితే ఆ విమర్శలకు సమాధానంగా వ్యక్తిగత స్థాయికి దిగజారి మాట్లాడటం, అవమానకర పదజాలాన్ని ఉపయోగించడం, ప్రత్యర్థులను శత్రువులుగా చిత్రీకరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అధికారంలో ఉన్నవారి భాష ఎంత ఘాటుగా ఉంటే, సమాజంలో అంతే స్థాయిలో విభజన పెరిగే ప్రమాదం ఉంటుంది. తెలంగాణ ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకున్నప్పుడు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఉద్యోగాల భర్తీ, రైతుల సమస్యల పరిష్కారం, మహిళలకు ఇచ్చిన హామీలు, యువతకు ఉపాధి అవకాశాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాల్లో వేగవంతమైన చర్యలు ఉంటాయని భావించారు. కానీ ప్రజల అంచనాలు ఒక వైపు ఉంటే, రాజకీయ వాగ్వాదాలు మరో వైపు సాగుతున్నాయన్న భావన క్రమంగా బలపడుతోంది. రాష్ట్రంలో అనేక కీలక సమస్యలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. రైతులు పంటలకు గిట్టుబాటు ధరలు కోరుతున్నారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఆశగా ఎదురుచూస్తోంది. పట్టణాలు, గ్రామాల్లో తాగునీరు, రహదారులు, మౌలిక సదుపాయాలపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలే ఉన్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వ దృష్టి మొత్తం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఉండాల్సింది పోయి రాజకీయ విమర్శలు, ప్రతివిమర్శల చుట్టూ తిరుగుతోందన్న అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకునేది ప్రత్యర్థులను తిట్టడానికి కాదు, సమస్యలను పరిష్కరించడానికి. ఎన్నికల సమయంలో చేసిన హామీలను అమలు చేయడానికి. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఎన్నికల ప్రచార భాషనే కొనసాగిస్తే, పాలనపై చర్చలు వెనుకబడిపోతాయి. ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వెనుక ఉన్న ఆకాంక్షలు గొప్పవి. అభివృద్ధిలో ఆదర్శంగా నిలవాలన్న లక్ష్యం ప్రజలది. అలాంటి రాష్ట్రంలో రాజకీయ నాయకుల మధ్య మాటల యుద్ధాలు ప్రధానాంశాలుగా మారడం దురదృష్టకరం. ప్రజలు ఇప్పుడు మాటలు కాదు, పనులు కోరుతున్నారు. ఆరోపణలు కాదు, ఆచరణ కోరుతున్నారు. రాజకీయ వేడి కాదు, పాలనా ఫలితాలు కోరుతున్నారు. ప్రభుత్వానికి ఇంకా సమయం ఉంది. ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రసంగాల కంటే ప్రజల జీవితాలను మార్చే నిర్ణయాలు ముఖ్యమైనవి. విమర్శలను సంయమనంతో ఎదుర్కొంటూ, అభివృద్ధి మరియు సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకున్న పాలననే ప్రజలు ఆశిస్తున్నారు. భాష పరాకాష్టకు చేరిన ఈ సమయంలో, పాలన కూడా అదే స్థాయిలో ఫలితాలను చూపించగలిగితేనే ప్రజల విశ్వాసం నిలబడుతుంది. లేకపోతే అసంతృప్తి జ్వాలలు మరింతగా వ్యాపించే ప్రమాదాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయలేరు.



“ స్వాతంత్ర్య వీరయోధులను దేశం స్మరించుకునే వేళ.. చోటానాగ్‌పూర్ అడవుల నుంచి ఒక పేరు మన చెవిలో గింగురుమంటుంది. నేలతల్లి రక్షకుడిగా (ధర్తీ ఆబా) ప్రజల నీరాజనాలందుకుంటున్న భగవాన్ బిర్సా ముండా పేరు అది. చెక్కుచెదరని నైతిక స్థైర్యం ఆయన సొంతం. చరిత్ర ప్రసిద్ధికెక్కిన ఓ వ్యక్తి మాత్రమే కాదు.. ఆత్మగౌరవానికీ, ప్రతిఘటనకూ, గిరిజన స్వాభిమానానికి సజీవ చిహ్నం బిర్సా ముండా. గిరిపుత్రుల అస్తిత్వాన్ని కాపాడుకోవాలని, అర్థవంతమైన సమానత్వం కావాలని, న్యాయబద్ధమైన వికాసం జనసామాన్యానికి చేరువ కావాలన్న ఆయన దార్శనికత... 'వికసిత్ భారత్' దిశగా నేటికీ దేశానికి మార్గనిర్దేశం చేస్తోంది. సమ్మిళిత వికాసమే ధ్యేయంగా దేశం ప్రాధాన్యాలను పునర్నిర్దేశించుకున్న పన్నెండేళ్ల అనంతరం... ఈ రోజుకూ నవభారత విధానాలు, పరిపాలన, ఆకాంక్షలను ఆ ఆదర్శాలు రూపుదిద్దుతున్నాయి.

పాటలూ, గాథలూ, దేశ గిరిజనులందరి స్మృతిలో భగవాన్ బిర్సా ముండా వారసత్వం చిరకాలంగా సజీవంగా ఉంది. 2021లో బిర్సా ముండా జయంతి రోజయిన నవంబరు 15ను 'జనజాతీయ గౌరవ దివస్'గా గుర్తించడం ద్వారా... ఆ వీరపరంపరకు గౌరవ ప్రధానమంత్రి దేశ వ్యాప్త గుర్తింపును తెచ్చారు. ఆయన 150వ జయంతిని పురస్కరించుకుని... 2024 నవంబర్ 15 నుంచి 2025 నవంబర్ 15 వరకు 'జనజాతీయ గౌరవ వర్ష్'గా నిర్వహించడంతో ఆయన స్మృతి మరింత బలంగా ప్రజల్లో నాటుకుపోయింది. గిరిజనుల అస్తిత్వాన్నీ, సాంస్కృతిక వారసత్వాన్నీ దేశవ్యాప్తంగా చాటిన ఈ కాలంలో... రెండు లక్షలకు పైగా కార్యక్రమాలను నిర్వహించగా, అవి మూడు కోట్లకు పైగా ప్రజలను చేరుకున్నాయి. ”

## నవ భారత పురోగతి..

# బిర్సా స్ఫూర్తి


రంజనా చోప్రా
కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి


దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఉత్సవాలు గిరిజన జీవితంలోని సుసంపన్నతకు, వైవిధ్యానికి అద్దం పట్టాయి. నాగాలాండ్‌లో హార్న్‌బిల్ ఉత్సవం, కేరళలో గిరిజన సాహిత్య ఉత్సవం నుంచి జార్ఖండ్‌లో జాతీయ గిరిజన చలనచిత్రోత్సవం, తెలంగాణలో కనో స్ప్రింట్ ఛాంపియన్‌షిప్ వరకు... ఈ కార్యక్రమాలన్నీ గిరిజన సంస్కృతిని, సృజనను, క్రీడలను, వారి కథన వైభవాన్ని జాతీయ స్థాయిలో వెలుగులోకి తెచ్చాయి. విభిన్నమైన సంస్కృతులు, తెగలకు చెందిన 11 లక్షలకు పైగా గిరిజనులు ఈ వేడుకల్లో భాగస్వాములయ్యారు. ఆధునిక భారతదేశాన్ని రూపుదిద్దడంలో గిరిజన వారసత్వాన్ని ఒక సజీవ శక్తిగా ఈ వేడుకలు చాటాయి. గిరిజన సాధికారత, సమ్మిళిత వికాసం ధ్యేయంగా గత పన్నెండేళ్లుగా దేశవ్యాప్తంగా సాగుతున్న నిరంతర, కేంద్రీకృత చర్యలకు ఊతమిచ్చేలా.. ఆ ప్రగతి వేగాన్ని 'జనజాతీయ గరిమ ఉత్సవ్- 2026' ముందుకు తీసుకెళ్తోంది. గిరిజనుల అభివృద్ధికి సంబంధించిన అన్ని కోణాలనూ ప్రతిబింబించేలా... వారానికో ఇతివృత్తంతో నాలుగు వారాల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. "ఈ దేశాన్ని తీర్చిదిద్దిన విశిష్ట వ్యక్తులను, సమాజాలను మనమెలా గుర్తించి గౌరవించుకోవాలి? ఆ పరంపరను ముందుకు తీసుకెళ్లేలా భావితరాలను ఎలా సాధికారులను చేయాలి?"- ఇదే ఈ ఉత్సవ మూడో వారంలో ప్రధానంగా దృష్టి సారించే ప్రశ్న.

ఎన్నోఏళ్లుగా ప్రధాన స్రవంతి చరిత్ర కథనాల్లో చోటు దక్కని ఎందరో గిరిజన వీరులను స్మరించుకోవడంతోనే ఈ ప్రశ్నకు జవాబు మొదలవుతుంది. గిరిజన ప్రాంతాల్లో తరతరాలుగా విద్యావేత్తలు, కళాకారులు, వైద్యులు, సంస్కర్తలు ఆ సమాజాలకు అండగా నిలుస్తూ, సాంస్కృతిక అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వచ్చారు. దేశ స్మృతిపథంలో వారి గాథలకు సముచిత స్థానం దక్కాల్సి ఉంది. వారి సేవలను రికార్డు చేసి, దేశ ప్రజల్లో ఘనంగా చాటేలా ప్రస్తుతం నిరంతర ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ మహత్తర ప్రయత్నంలో దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన పరిశోధన సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మౌఖిక చరిత్రలను గ్రంథస్థం చేయడం, స్థానిక గిరిజన విజ్ఞాన వ్యవస్థలను రికార్డు చేయడం, గిరిజన భాషలను, సాంస్కృతిక సంప్రదాయాలను కాపాడడంలో ఇవి నిమగ్నమయ్యాయి. ప్రస్తుతం 26 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లోని 29 గిరిజన పరిశోధన సంస్థలు ఈ బాధ్యతను భుజానికెత్తుకున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటివరకు 222 గిరిజన భాషల్లో 355 ప్రాథమిక పాఠ్యపుస్తకాలను రూపొందించారు. అమూల్యమైన సాంస్కృతిక విజ్ఞానాన్ని భావితరాల కోసం భద్రపరచడంలో ఇవెంతగానో దోహదపడుతున్నాయి.

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియాలు కూడా దేశ చరిత్రలో వారి త్యాగాలను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లేలా... ఆ వీరయోధుల స్మృతి చిహ్నాలుగా, వారి స్మారకాలుగా నిలుస్తున్నాయి. దేశ స్వాతంత్ర్యోద్యమంలో గిరిజన సమాజాల వీరోచిత పాత్రను సగౌరవంగా చాటేలా.. 10 రాష్ట్రాల్లో ఇలాంటి 11 మ్యూజియాల ఏర్పాటును గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంజూరు చేసింది. ఇందులో రాంచీలోని భగవాన్ బిర్సా ముండా, నవ రాయ్‌పూర్‌లోని షహీద్ వీర నారాయణ్ సింగ్ మ్యూజియాలతోపాటు నాలుగు మ్యూజియాలను ఇప్పటికే ప్రారంభించారు. ఈ సంస్థలు గిరిజన యోధుల వీరగాథలను గ్రంథస్తం చేసి, ఘనంగా దేశానికి చాటడమే కాకుండా... దేశ చారిత్రక స్మృతిపథంలో అవి చిరకాలం నిలిచిఉండేలా కృషి చేస్తున్నాయి.

ఆశలతో సాగుతున్న తరానికి వెన్నుదన్ను

గత వైభవాన్ని స్మరించుకోవడమే కాదు... సహజంగానే నవతరాన్ని సాధికారులను చేసే దిశగా ఈ ప్రయాణం సాగుతోంది. గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ అందిస్తున్న ఉపకార వేతనాల ద్వారా లబ్ధి పొందుతున్న గిరిజన విద్యార్థుల సంఖ్య ఎప్పటికప్పుడు పెరుగుతుండడమే దీనికి నిదర్శనం. ఒక్క ఈ సంవత్సరంలోనే మొత్తం రూ. 3,825.54 కోట్లతో... అయిదు స్కాలర్‌షిప్ పథకాల కింద రికార్డు స్థాయిలో 26,01,979 మంది గిరిజన విద్యార్థులకు ఆర్థిక చేయూత లభించింది. వీరిలో చాలామంది తమ కుటుంబాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న మొదటి తరం కావడం విశేషం. వ్యక్తిగత ఆకాంక్షలను మాత్రమే కాదు... తమ సమాజాల ఆశలను కూడా వీరు భుజాన మోస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రస్తుత స్కాలర్‌షిప్ లబ్ధిదారులలో 56 శాతానికి పైగా మహిళలే ఉండడం గమనార్హం. విద్యను అందరికీ అందుబాటులోకి తేవడంతోపాటు సమాన అవకాశాలను కల్పించడంలో అదే దృఢ సంకల్పానికి... ఏకలవ్య ఆదర్శ ఆవాస పాఠశాలల (ఈఎంఆర్ఎస్) విస్తరణ నిదర్శనం. మంజూరైన ఏకలవ్య పాఠశాలల సంఖ్య 2013-14లో 167గా ఉంటే.. 2025-26 నాటికి అది ఏకంగా 723కు పెరిగింది. అంటే ఇందులో 330 శాతానికి పైగా వృద్ధి నమోదైంది. ఇదే సమయంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న పాఠశాలల సంఖ్య కూడా 123 నుంచి 499కి చేరింది. విద్యార్థుల నమోదు కూడా 0.34 లక్షల నుంచి 1.56 లక్షలకు పైగా భారీగా పెరిగింది. గిరిజన ప్రాంతాల్లో నాణ్యమైన వసతి సదుపాయాలతో విద్యను అందించడం ద్వారా... ఈ ఏకలవ్య సంస్థలు దేశవ్యాప్తంగా గిరిజన యువతలో విద్యాపరంగా బలమైన పునాదులను వేస్తూ, వారి అవకాశాలను మరింత విస్తరిస్తున్నాయి. కేవలం పథకాల విస్తరణను మాత్రమే కాదు... దానికి అతీతమైన ఒక విస్తృతమైన నిర్మాణాత్మక మార్పును ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. ఇక్కడ అందించే ఉపకారవేతనాలు, ఫెలోషిప్‌లు కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదు.. అవి ఆ విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్నీ, ప్రాతినిధ్యాన్నీ, నాయకత్వ లక్షణాలనూ పెంపొందించే పెట్టుబడులు. మా సంకల్పంలో ఎంతమాత్రమూ రాజీలేదు: భౌగోళిక పరిస్థితులు, సామాజిక నేపథ్యం లేదా విద్యా సంస్థలు అందుబాటులో లేకపోవడం వల్ల ఒక్క గిరిజన విద్యార్థి కూడా అవకాశాలను కోల్పోకూడదన్నదే మా లక్ష్యం.

ఈ విద్యా విప్లవంతోపాటు క్షేత్రస్థాయి నాయకత్వంలో గిరిజన మహిళల నేతృత్వంలో ఒక విప్లవాత్మక మార్పు చోటుచేసుకుంటోంది. తరతరాలుగా గిరిజన మహిళలు తమ సంస్కృతికీ, సహజ వనరులకూ, సామాజిక జీవనానికి నిశ్శబ్ద రక్షకులుగా నిలుస్తూ... కుటుంబాలనూ, సంప్రదాయాలనూ కాపాడుకుంటూ వస్తున్నారు. భారత్‌లో ప్రస్తుతం 5.20 కోట్ల మంది గిరిజన మహిళలున్నారు. ఇది మొత్తం గిరిజన జనాభాలో దాదాపు సగభాగం. సమ్మిళిత అభివృద్ధిని సాకారం చేయడంలో వారు ముందువరుసలో నిలవడం నేడు అత్యంత కీలకమైన అంశం. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 4,712 వన్ ధన్ వికాస్ కేంద్రాలు మంజూరు కాగా... అందులో 3,365 కేంద్రాలు విజయవంతంగా నడుస్తున్నాయి. వీటి ద్వారా 12.9 లక్షల మందికి పైగా లబ్ధి పొందుతున్నారు. ఈ లబ్ధిదారులలో సగానికి పైగా మహిళలే ఉండడం గమనార్హం. ఈ నిరంతర చర్యలు క్షేత్రస్థాయి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడమే కాకుండా... గిరిజన మహిళలకు మరింత మెరుగైన ఆర్థిక, సామాజిక సాధికారతను చేకూరుస్తున్నాయి.

పురోగమన పరంపర

ఈ వేడుకలు, సంస్మరణలు, విద్యా విప్లవం, మహిళల నాయకత్వం... ఒక మహత్తరమైన, అవిచ్ఛిన్నంగా సాగుతున్న పయనంలో ఇవన్నీ భాగమయ్యాయి. నేడు గిరిజన సమాజాలు పూర్తి ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో భారత భవితను సరికొత్తగా తీర్చిదిద్దుతున్నాయి. ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ (డీఏ-జేజీయూఏ), ప్రధానమంత్రి జనజాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ వంటి పథకాల ద్వారా క్షేత్రస్థాయిలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయి. సమన్వయం -- భాగస్వామ్యం అన్న సరికొత్త నమూనాలో ఈ పరివర్తన సాగుతోంది. గిరిజన పరిశోధకులకు గుర్తింపు, విస్మృత వీరులను ప్రజలకు పరిచయం చేయడం, గిరిజన మహిళల్లో పెరుగుతున్న నాయకత్వ లక్షణాలు... వెరసి భగవాన్ బిర్సా ముండా ఆశయాలూ, వారసత్వమూ నేడు దేశంలో ఎంత సజీవంగా ఉన్నాయో స్పష్టం చేస్తున్నాయి. నేడు దేశంలోని 10.5 కోట్లకు పైగా గిరిజన పౌరులు.. దేశ చరిత్రలో అత్యంత ఆకర్షణీయమైన, భవిష్యత్తు దిశగా దూసుకెళ్తున్న ఒక నూతన అధ్యాయాన్ని లిఖిస్తున్నారు. దేశ ప్రగతిలో వారెక్కడో దూరతీరాల్లో లేరు. పరిశోధనలను కొత్త పుంతలు తొక్కిస్తున్న మేధావులు, నాయకత్వానికి సరికొత్త నిర్వచనాన్నిస్తున్న మహిళలు, ఇన్నేళ్లకు దేశవ్యాప్త గుర్తింపును పొందుతున్న విస్మృత వీరులు... వికసిత భారత్ స్వప్నాన్ని సాకారం దిశగా ఇవన్నీ అసామాన్యమైన అంశాలే. ఈ మహత్తర ప్రస్థానంలో ధర్తీ ఆబా వారసత్వం నిరంతరాయంగా పురోగమిస్తోంది.


రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.